
ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY



నల్లగొండ

1

ఆదివారం 20 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 24.6



కొలతలు సేకరిస్తున్న భువన్ సర్వే ఉద్యోగులు (ఫైల్)

ఆస్తి పన్ను అమాంతం పెరిగింది

- ఆందోళన వ్యక్తం చేస్తున్న మిర్యాలగూడ పట్టణ ప్రజలు
- 'భువన్ యాప్' వల్లే అంటున్న మునిసిపల్ అధికారులు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన తేలు కిరణ్ ఆస్తి పన్ను చెల్లించేందుకు మునిసిపల్ కార్యాలయానికి వచ్చాడు. 5శాతం తగ్గింపు వస్తుందని భావించిన కిరణ్, వార్డు ఆఫీసర్ (ఆస్తి పన్ను వసూలు చేసే ఉద్యోగి) చెప్పిన మొత్తాన్ని విని బిత్తరపోయాడు. ఎందుకంటే అతను గత ఏడాది ఏప్రిల్‌లో చెల్లించిన మొత్తానికంటే రూ.700 అదనం అది.

● మునిసిపల్ కార్యాలయానికి ఎదురుగా ఉండే బహుళ అంతస్తుల భవనంలో నివసించే మంగతాయారు ముందస్తు ఆస్తి పన్ను (5 శాతం తగ్గింపుతో) చెల్లించేందుకు మునిసిపల్ కార్యాలయంలోని 10వ నెంబరు రూంలోకి వెళ్లింది. ఎప్పటిలాగే అర్నెళ్ల కిస్తీలు రెండు చెల్లించేందుకు రూ.1,800 తీసుకెళ్లింది. అయితే బిల్ కలెక్టర్ సంవత్సరానికి ఆస్తి పన్ను రూ.2,510 చెల్లించాలని మిషన్‌లో డిస్‌ప్లే అవుతున్న డిమాండ్‌ను చూపించాడు. దీంతో అవాక్కయిన సదరు మహిళ పన్ను చెల్లించకుండానే వెనుదిరిగింది.

ఇల్లు పాతదే, విస్తీర్ణం అప్పటిదే, కొలతలు నాటివే అయినా ఆస్తి పన్ను అమాంతం పెరిగింది. ఇదేంటని అడిగితే గూగుల్‌లో అలానే వచ్చిందని రెవెన్యూ ఉద్యోగి, భువన్‌యాప్ నిర్ణయించిందని వార్డు ఆఫీసర్ బదులిస్తున్నారు. అయితే అందరికీ పెరగాలి కదా? తమకే ఎందుకు పెరిగిందని అడిగితే శాటిలైట్ సాయంతో భువన్‌యాప్ కొలతలు సేకరించిందని సెలవిస్తున్నారు మునిసిపల్ అధికారులు.

పెరుగుతున్న పన్ను భారం

పట్టణ ప్రజలకు పన్ను భారం పెరుగుతోంది. చాపకింద నీరులా ప్రచారం లేకుండా పెంచుతున్న ఆస్తి పన్ను మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక ప్రభావం చూపుతోంది. పట్టణంలోని అపార్ట్‌మెంట్‌లలో సుమారు 1,000 అడుగుల విస్తీర్ణం ఉన్న ఫ్లాట్‌కు ఆరు నెలలకు ఆస్తి పన్ను రూ.900 ఉండేది. 2024-25 ఆర్థిక సంవత్సర ద్వితీయార్థంలో ఆస్తి పన్ను సవరణ జరిగినట్టుగా సమాచారం. అయితే అధికారులెవ్వరూ దీన్ని ధ్రువీకరించడం లేదు. అంతా ఆన్‌లైన్ అయిందని, భువన్ సాంకేతికత ద్వారా ఆటోమెటిక్‌గా ఆస్తి పన్ను సవరణ జరుగుతోందని అధికారులు

మిగతా 4వ పేజీలో...

అందాల భామలకు ఉమ్మడి జిల్లా ఆతిథ్యం

- పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్న మిస్‌వరల్డ్ పోటీదారులు
- వచ్చే నెల 12న నాగార్జునసాగర్‌కు
- 15న పోచంపల్లి, యాదగిరిగుట్టకు ప్రపంచ సుందరీమణులు

'ప్రపంచ సుందరీమణులైన అందాల భామలకు ఆతిథ్యమిచ్చేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా వేదిక కానున్నది. ఇక్కడి ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలను మిస్‌వరల్డ్ పోటీదారులు సందర్శించేందుకు అవసరమైన ఏర్పాట్లను రాష్ట్ర పర్యాటకశాఖ డైరెక్టర్ స్మిత సబర్వాల్ నేతృత్వంలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ప్రభుత్వం హైదరాబాద్‌లో మే 7 నుంచి 31వ తేదీ వరకు 72వ ఎడిషన్ మిస్ వరల్డ్-2025 పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణ చేనేత కళను ప్రపంచానికి చాటేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ పోటీలకు 140 దేశాల నుంచి 3వేల మంది అందాల భామలు, విదేశీ ప్రతినిధులు హాజరుకానున్నారు. వీరి ద్వారా హైదరాబాద్‌తోపాటు పర్యాటక కేంద్రాలకు అంతర్జాతీయంగా గుర్తింపు తీసుకొచ్చేందుకు పర్యాటక, సాంస్కృతికశాఖ ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగా ఫ్యాషన్ ప్రపంచానికి ప్రతీకగా నిలిచే ఐరోపా దేశాల ప్రతినిధులతో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను ధరింపజేసి తద్వారా ఇక్కడి వస్త్రాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో అందాల భామలు భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట, నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించనున్నారు.

● ఆంధ్రజ్యోతి, భూదాన్‌పోచంపల్లి





హైదరాబాద్ వేదికగా జరగనున్న 72వ మిస్‌వరల్డ్ పోటీలను తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు వేదికగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. ముఖ్యంగా పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాలను ఫ్యాషన్ ప్రపంచానికి మరింత చేరువ చేసి, నేతన్నలకు అండగా నిలిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

మే 15న పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలతో ర్యాంప్ వాక్

చేనేత ఇక్కత్ వస్త్రాలకు అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన భూదాన్‌పోచంపల్లిని మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొనే అందాల భామలు మే 15న సందర్శించనున్నారు. ఇక్కడి చేనేత కార్మికులతో వారు ముఖాముఖి మాట్లాడుతారు. అనంతరం చేనేత మగ్గాలపై చేనేత డబుల్ ఇక్కత్, సింగిల్ ఇక్కత్ వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలిస్తారు. తరువాత పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ చీరలు ధరించి ర్యాంప్ వాక్ చేసేలా కార్యక్రమాలను రూపొందించారు. మిస్‌వరల్డ్ ఈవెంట్లను నిర్వహించే సంస్థ పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల విశిష్టతను వీడియోగ్రఫీ చేస్తోంది. ఫలితంగా చేనేత ఉత్పత్తులను అంతర్జాతీయంగా మరింత పేరును తీసుకురావడమే ఈవెంట్‌ల ముఖ్య ఉద్దేశ్యమని తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ స్మిత సబర్వాల్ తెలిపారు. ఇప్పటికే అనేక ఫ్యాషన్ ఈవెంట్లకు వేదికగా నిలిచిన పోచంపల్లికి ఇప్పుడు మరోసారి ప్రపంచ సుందరీమణులు వస్తుండడంతో ఈ ప్రాంతం అంతర్జాతీయంగా మరింత ఖ్యాతి పొందనుంది.

పోచంపల్లి గ్రామీణ పర్యాటకంలో ప్రత్యేక ఏర్పాట్లు

మిస్‌వరల్డ్-2025 పోటీల్లో 'చేనేత థీమ్' ప్రత్యేక ఆకర్షణగా

మిగతా 2వ పేజీలో...

ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి సన్నబియ్యం, తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలన్నారు. దేశంలో అత్యధికంగా వరి సాగుచేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందన్నారు. వానాకాలంలో 153లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, యాసంగిలో 125.5లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. వానాకాలం పంటను ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసినందుకు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులకు, సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు. వానాకాలం కంటే యాసంగి సీజన్‌లో అదనంగా 70లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, దీనిపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ చేయాలన్నారు. రైస్‌మిల్లర్లు తాలు, తరుగు పేరుతో ఎలాంటి కోతలు విధించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎఫ్‌సీఐ మార్గదర్శకాల ప్రకారం నూకల శాతం 25 దాటకుండా చూడాలని, ప్రభుత్వం అందించే ధరకంటే అధికంగా ఉన్నప్పుడు మాత్రమే రైతులు ప్రైవేట్‌గా ధాన్యం విక్రయించాలని, తక్కువ ధరకు ఎట్టి పరిస్థితుల్లో విక్రయించవద్దని అన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంలో పోలీసుల భాగస్వామ్యం

చందంపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణతోపాటు వారి ఆరోగ్య విషయంలో కూడా పోలీసులు భాగస్వాములవుతున్నారని ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. శనివారం మండలంలోని పోలేపల్లి యూపీఎస్ పాఠశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్‌శాఖ ప్రజా రక్షణతోపాటు సమాజ ఆరోగ్య రక్షణకు కూడా పాటుపడటం శుభపరిణామం అన్నారు. మండలం ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు రక్షణతోపాటు ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో దేవరకొండ ఏఎస్పీ మౌనిక, సీఐ సురేష్, ఎస్ఐ సతీష్, కాంగ్రెస్ నాయకులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

'భూభారతి'తో ఏటా రికార్డుల అప్‌డేట్

కలెక్టర్ ఇలా త్రిపాఠి

హాలియా, పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): భూభారతితో ఏటా రికార్డులను అప్‌డేట్ చేస్తామని, భూములకు హద్దులు నిర్ణయించేందుకు సర్వేయర్ల ద్వారా జియో కోఆర్డినేట్ ఏర్పాటు చేసే వెసులుబాటు ఈ చట్టంలో ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం తిరుమలగిరి(సాగర్), పెద్దవూర మండల కేంద్రాల్లో, అనుముల మండలం కొత్తపల్లి రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూములను సర్వే చేసేందుకు గతంలో రైతులు, అధికారులు, తహసీల్దార్లు ఇబ్బందులు పడేవారని, భూభారతి ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే లైసెన్స్ సర్వేయర్ పద్ధతిని తీసుకురానున్నామన్నారు. భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని, అందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టంపై రైతులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. ధరణిలో 4వేలకు పైగా క్వెరీలు ఉండేవని, భూభారతిలో కేవలం ఆరు మాడ్యుల్స్ మాత్రమే ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 2020 అక్టోబరు వరకు ఉన్న సాదాబైనామాలపై అప్పీలు పద్ధతి ఉండేదని, ఇప్పుడు భూభారతిలో ఆర్డీవోకు అప్పీలు చేసుకోవచ్చన్నారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా ప్రజలకు మేలు చేసే అవకాశం అధికారులకు ఉందన్నారు.



అనుమల మండలం కొత్తపల్లిలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

'భూభారతి' రైతులకు చుట్టం : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం రైతులకు చుట్టమని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానం మేరకు ధరణి స్థానంలో భూభారతి తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక తిరుమలగిరి(సాగర్) మండలంలోనే మొదటిసారి అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటై 4వేల ఎకరాలకు సంబంధించి సుమారు 4,500 మంది రైతులను అర్హులుగా గుర్తించి పట్టాలు జారీ చేయనుండడం గర్వకారణమన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ ఏడాది లోపే అమలు చేసిందన్నారు. అంతేగాక సన్నబియ్యం వంటి బృహత్తర కార్యక్రమాన్ని అమలు చేసిందన్నారు. 'ధరణి'ని బంగాళఖాతంలో కలిపేస్తామన్నట్లుగానే సీఎం రేవంత్‌రెడ్డి దాన్ని చేసి చూపించారని, అదేవిధంగా రైతుల భూసమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం అందించే దిశగా 'భూభారతిని' తీసుకురావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో డీఈవో భిక్షపతి, పీసీసీ సభ్యుడు కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, యడవల్లి నరేందర్‌రెడ్డి, కాంసాని చంద్రశేఖర్, వెంపటి శ్రీనివాస్, గౌని రాజారమేష్‌యాదవ్, అలుగుల బ్రహ్మారెడ్డి, నాగిరెడ్డి, కోటిరెడ్డి, పిల్లి ఆంజనేయులు, కలసాని చంద్రశేఖర్, చవ్వా బ్రహ్మానందరెడ్డి, గడ్డం సాగర్‌రెడ్డి, అబ్బిడి కృష్ణారెడ్డి, ఏవో సరిత, ఏపీఎం కళావతి, రైతులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ సిబ్బందితో డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

నిడమనూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రాల సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ల్యాబ్‌తో పాటు స్టోర్‌రూంను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది సమయ పాలన పాటించి విధులకు హాజరుకావాలన్నారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందుతోందని, ఆరోగ్య కేంద్రాల్లో కూడా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచామన్నారు. ఆర్‌ఎంపీలు రోగులకు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని, అర్హతకు మించి చికిత్స చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబుల్లో ధరల పట్టికలు కచ్చితంగా ప్రదర్శించాలని, వైద్యుల విద్యార్హతలు, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ నెంబర్ కూడా ప్రదర్శించాలన్నారు. ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపర చర్యలు తీకుంటామన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న పీహెచ్‌సీ భవనాన్ని, మండల పరిధిలోని తుమ్మడం గ్రామంలో నిర్మిస్తున్న సబ్ సెంటర్ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కేసా రవి, మండల వైద్యాధికారులు డాక్టర్ అరవింద్, రఫి, సిబ్బంది గంటా సోమయ్య, జలీల్‌పాషా, తదితరులు ఉన్నారు.

డీఎస్‌వోగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ




డీఎస్‌వోగా బాధ్యతలు తీసుకున్న వెంకటేష్‌కు మొక్కను అందజేస్తున్న అధికారులు, సిబ్బంది

నల్లగొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా టి.వెంకటేష్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన హైదరాబాద్ నుంచి బదిలీపై రాగా, ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీఎస్‌వోగా విధులు నిర్వహించిన హరీష్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు ఏఎస్‌వో రాజశేఖర్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బీ.వెల్లెంల రిజర్వాయర్‌లోకి నీటి విడుదల

● 2లో..

విజయోత్సవ సభను విజయవంతం చేయాలి




విలేకరులతో మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

చండూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మే నెలలో నిర్వహించే విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిరడమర్తి రవి అన్నారు. మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కురుపాటి సుదర్శన్‌తో కలిసి శనివారం చండూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మాదిగలకు 9శాతం రిజర్వేషన్ అమలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా మాదిగలు చేసిన నిర్విరామ పోరాటానికి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయం జరుగుతోందన్నారు. రోస్టర్ పాయింట్ 6శాతం కాకుండా 7శాతం కల్పించేందుకు మందకృష్ణ కృషి చేయాలన్నారు. ఏపీలో జిల్లాల వారీగా వర్గీకరణ తీసుకువచ్చిన మాదిరిగానే రాష్ట్రంలో కూడా జిల్లాల వారీగా వర్గీకరణ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. మే మొదటి వారంలో హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో 10లక్షల మందితో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో నక్క మహేష్, జోగు గణేష్, సంజీవ, విజయ్, జంగయ్య, జగన్, సామ్రాట్ కిరణ్, పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి సహకార వ్యవస్థ కృషి

డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి సహకార వ్యవస్థ కృషి అమోఘమని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సహకార కేంద్ర బ్యాంకులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించడం సంతోషకరమన్నారు. గడిచిన కొన్నేళ్లలో సహకార వ్యవస్థలో చాలా మార్పులు జరిగాయని, చట్టాలపరంగా, సాంకేతికపరంగా మార్పులు వచ్చాయన్నారు. ఈ సహకార సంస్థ మరింత పురోగతి సాధించడంలో భాగంగా సంఘాలు, డీసీవో వ్యవస్థ, బ్యాంకులు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. 2024-25లో సహకార కేంద్ర బ్యాంకు అన్ని లాభాలు గడించడంతో పాటు ఎన్‌పీఏలు తగ్గించడంలో పురోగతి సాధించిందన్నారు. సమావేశంలో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల డీసీవోలతో పాటు బ్యాంక్ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదయ్య, వంగూరి రంగాచారి, రామచంద్రయ్య, జూలురి శ్రీనివాస్, వీరస్వామి, సీఈవో శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

నాన్నమాట.. మంచి బాట

● చిన్నతనంలోనే పిల్లలకు మార్గనిర్దేశం

● పిల్లలు పెద్దయ్యాక కనిపిస్తున్న ఫలితం



మనోగతం

పిల్లల కోసం నాన్నలు అన్నీ చేస్తుంటారు. అదే సమయంలో జీవితంలో ఎదుగుదలకు ఎలాంటి పనులు చేయకూడదో పిల్లలకు చెబుతుంటారు. సమయం, సందర్భాన్ని బట్టి జీవితంలో ఇవి చేయకుంటే నీ భవిష్యత్‌కు ఢోకా ఉండదని హితబోధ చేస్తుంటారు. ఆ సమయంలో ఏంటో నాన్న ఎప్పుడూ ఏదో ఒకటి చెబుతుంటాడు. ఇలా చేయాలి, అలా ఉండాలి అంటుంటాడని అనుకుంటాం.. అలా అనుకున్నప్పటికీ ఆ నాన్న మాటలను పాటించి ఆనందంగా గడుపుతూ, నాన్న మాట విని ఉంటే ఇంకా ఉన్నతంగా ఎదిగే వాళ్లమని అంటున్న పలువురి మనోగతం..

మందు తాగొద్దు అంటే అర్థం కాలేదు

(ఆంధ్రజ్యోతి-కోదాడ)



జీవితంలో ఎదగాలంటే నీవు ఏమన్నా చెయ్ మందు తాగొద్దు అని చిన్నతనంలో మా నాన్న సాంబయ్య చెప్పేవాడు, నాకు అర్థం కాకపోయేది. పెద్దయ్యాక ఇప్పుడు అర్థమవుతున్నాయి ఆయన చెప్పిన మాటలు. నాకు ఇప్పుడు వయస్సు 44. నాన్న చెప్పిన మాటలువిని ఏనాడూ మందు జోలికి వెళ్లలేదు. వ్యాపారరీత్యా కోల్‌కత్తా, ముంబాయి, ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్తా. 10నుంచి 15 మంది స్నేహితులను కలుస్తాం. అందరూ మందు పార్టీలు చేస్తారు. కానీ నేను మాత్రం నాన్న చెప్పిన మాట ప్రకారం మందు జోలికి వెళ్లను. ఈ రోజు ఆయన మాటల ఫలితంగా జీవితంలో మంచిగా స్థిరపడినా. పిల్లలను మంచిగా చదివిస్తున్నా. అంతేకాక మందు తాగి డ్రైవింగ్ చేయకూడదు అనే నాన్న చెప్పేవారు. ఆ విషయాన్ని మా మిత్రులకు చెప్పినా. చాలామంది ఆ మాటల విని మద్యం తాగి డ్రైవింగ్ చేయరు. అది కూడా నాకు చాలా సంతోషాన్ని ఇస్తుంది.



ఆలగడప మురళీ, వ్యాపారస్థుడు, కోదాడ

వ్యాయామం చేయమనేవారు



చిన్నతనంలో మా నాన్న వ్యాయామం చేయాలని తరుచూ చెప్పేవారు. అప్పుడు ఏదోలా అనిపించేది. అప్పుడు విని ఉంటే ప్రస్తుతం ఆరోగ్య సమస్యలు వచ్చేవి కావనిపిస్తోంది. నాన్న రంగారావు నా చిన్నతనంలో 300 మందితో వ్యాయామశాల ఏర్పాటుచేశారు. అయినప్పటికీ నేను పుస్తకాలపై ఉన్న శ్రద్ధను వ్యాయామంపై పెట్టలేదు. అప్పుడు నాన్న మాట వినివుంటే ఇప్పుడు మరోలా ఆరోగ్యం ఉండేది. అదేవిధంగా వారపత్రికలను అధికంగా చదివేవాడిని. అదికాదు పాఠ్యపుస్తకాలు చదవాలని చెప్పేవారు. ప్రస్తుతం అప్పుడు చదివిన పాఠ్యపుస్తకాలు, వారపత్రికల మూలంగా కవితలు, రచనలు, జ్ఞాపక శక్తి పెరగడానికి కారణంగా ఉంది. ఇది ఎంతో మేలు చేసింది.



పెద్దిరెడ్డి గణేష్.సుధాబ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ , సూర్యాపేట

చదువుపై ఇంకాస్త శ్రద్ధ వహిస్తే బాగుండేది

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)



నా చిన్నతనంలో మా నాన్న సోమిరెడ్డి మాట ప్రకారం చదువుపై ఇంకాస్త దృష్టి సారించి ఉంటే చదువుల్లో రాణించేవాడిని. ఆయన కలలు కన్న విధంగా డెంటల్ డాక్టర్‌గా లేదా ఇంజనీరింగ్ విభాగంలో విదేశాల్లో ఉన్నతంగా ఉండేవాడిని. అయితే ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం నన్ను రాజకీయాల వైపు మళ్లించింది. నాకల ప్రకారం ప్రజలకు సేవ చేసే అవకాశం కలుగుతోంది. మున్ముందు ప్రజలకు మరింత సేవచేస్తా. రాజకీయాలకు రాకుండా ఉంటే నాన్న మాట ప్రకారం చదువుల్లో రాణించి విదేశాల్లో జీవితంగా ఉన్నతంగా ఉండేది. అప్పుడు నాన్న గారు చెప్పిన విధంగా డాక్టర్ అయి ప్రజలకు సేవ చేసే అవకాశం రాజకీయాల ద్వారా లభించింది. నాన్న చెప్పిన సేవా గుణం ఇప్పుడు చేస్తుంటే కాస్త సంతోషంగా ఉంటుంది.



పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్

రాజకీయాలొద్దూ.. కష్టే ఫలి అనేవాడు

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)



నాకు యుక్త వయసులో రాజకీయాలంటే మక్కువ ఉండేది. అయితే రాజకీయాలు మనలాంటోళ్లకు వద్దని మా నాన్న రామయ్యాచారి చెబితే వినకుండా కొన్నిరోజులు రాజకీయాల్లో పాల్గొన్నా. అయితే కష్టపడితేనే ఫలితం ఉంటుందని, కష్టే ఫలి అంటూ మా నాన్న నా చిన్నపుడు చెవిలో జోరీగలా చెప్పేవాడు. కొద్దిరోజుల తర్వాత ఆయన చెప్పినట్లు కష్టపడటంతో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించా. తర్వాత నాన్న మాట నాకు అపుడు అర్థమయ్యింది. ఆయన ఆ రోజు బెత్తంతో నన్ను దండించడం వల్లే నేను కూడా బెత్తం పట్టుకుని ఉపాధ్యాయుడిగా పనిచేశానన్న జీవిత సత్యం బోధపడింది. ప్రతీ తండ్రి వారి బిడ్డల భవిషత్ కోసమే కాస్త కఠినంగా ఉంటాడని నాకు అర్థమయ్యింది. ఈ తరం పిల్లలకు కూడా నేను అదే సూచిస్తున్నా. తండ్రి మాట వినండి.



చొక్కళ్ల పుష్పగిరి, విశ్రాంత ఉపాధ్యాయుడు, నార్కట్‌పల్లి

ఈతకు వేళాయే..

● 20 నుంచి ఈత కొలను పునఃప్రారంభం

● అడ్మిషన్లు షురూ

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ స్పోర్ట్స్)

వేసవి తీవ్రత తట్టుకునేందుకు ప్రజలు ఆహ్లాదకరమైన ప్రదేశాల్లో గడపడానికి ఇష్టపడతారు. మరోపక్క ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈనెల 23 నుంచి వేసవి సెలవులు వస్తున్నాయి. ఇప్పటికే పదవ పరీక్షలు పూర్తయినందున సరదాగా గడిపేందుకు పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. ఎప్పుడెప్పుడా అని ఆతృతగా ఎదురు చూస్తున్న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం ఈత కొలను అందుబాటులోకి రానే వచ్చింది. జిల్లా క్రీడా అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈత కొలనులో పెద్దలు, యువకులు, విద్యార్థులు సరదాగా ఈత కొట్టేందుకు సిద్ధపడుతున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలోని ఈత కొలను నిర్వహణకు సర్వ సిద్ధం చేశారు. నెల రోజుల నుంచి ఈత కొలనుకు మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసువచ్చారు. అన్నిహంగులతో తీర్చిదిద్దారు. నీటిని పూర్తి స్థాయిగా నింపారు. కోచ్‌లను, టెక్నికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఈత కొలను పునఃప్రారంభం కానుంది. మూడు నెలల పాటు కొలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేశారు.

నెల వారీ ఫీజు రూ.1000

ఈత కొలనులోని ప్రవేశం పొందాలంటే అడ్మిషన్ ఫీజు రూ.400, నెల ఫీజు రూ.1000 చెల్లించి పాస్ తీసుకోవాల్సి ఉంది. అప్పుడే ఈత కొలనులోని ప్రవేశం ఉంటుంది. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 7 గంటలకు వరకు పెద్దలకు, 7 నుంచి 9 గంటల వరకు యువకులు, బాల, బాలికలు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు పెద్దలకు, 5 నుంచి 7 గంటల వరకు బాల, బాలికలకు పాస్‌లు ఉన్నవారు ఈతను కొట్టవచ్చు. 18 ఏళ్ల వయస్సు నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్న వారు ఈత కొట్టేందుకు అర్హులు, జలుబు, దగ్గు, జ్వరం, చర్మవాధులు కలిగిన వారు, ఫిట్స్‌లు, తల తిరిగే పరిస్థితి ఉన్నవారికి ఈత కొలనులోకి ప్రవేశం లేదు. ముందుగా డాక్టర్ ధ్రువీకరణ పత్రం తీసుకువస్తే అనుమతి ఉంటుంది. ఈత కొలనుకు దిగే ముందు స్నానాల గదిలో శుభ్రంగా స్నానం చేసి, మలమూత్రాలను విసర్జన చేసి స్విమ్మింగ్ డ్రెస్ ధరించాలి. ఈత కొలనులో ఇద్దరు కోచ్‌లను, టెక్నికల్స్‌ను అందుబాటులో ఉంచారు. ఈత కొలను ప్రతి రోజూ నీటితో నింపుతారు. ఈత కొలను శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్‌డీఈ కుంభం నర్సిరెడ్డి కోరుతున్నారు. శుక్రవారం ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కుంభం రాంరెడ్డి ప్రత్యేకంగా ఈతకొలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నజీర్ తదితరులు ఉన్నారు.



ఈత కొలను పరిశీలిస్తున్న డీఎస్ఏ అధికారులు



కొలను బాట పట్టిన చిన్నారులు

(ఆంధ్రజ్యోతి-కోదాడ)

వేసవి దృష్ట్యా విద్యాసంస్థలకు సెలవులు దగ్గర పడుతుండటంతో చిన్నారులు స్విమ్మింగ్ బాట పడుతున్నారు. ఉదయం పూట స్కూల్‌కు వెళ్లి వచ్చి మధ్యాహ్నం ఈతకు వెళ్తున్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలు ఈత నేర్చుకుంటే, అనుకొని సంఘటనలు జరిగినప్పుడు, నీటి ఇబ్బందులు ఉండవని తలంపుతో ఈతను నేర్పిస్తున్నారు. చిన్నారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఈతను నేర్చుకుంటున్నారు.

భూసార పరీక్షకు సమయం ఆసన్నం

పంటల్లో అధిక దిగుబడులు సాధించాలంటే ఎన్నో జాగ్రత్తలు అవసరం. సాగుకు భూమి సిద్ధం చేయడం నుంచి పంట చేతికొచ్చే వరకూ ఆయా దశల్లో చర్యలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రధానంగా భూసార పరీక్ష చేయించి ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే ఫలితం దక్కుతుందని వ్యవసాయ శాఖ అధికారులు, ఏరువాక శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. భూసార పరీక్ష ద్వారా నేల స్వభావం తెలిసి ఏ పంట సాగు చేస్తే ఏ మేర దిగుబడి వస్తుందో అంచనా వేయవచ్చంటున్నారు. మే నెల నుంచి వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మట్టి పరీక్షలు చేయిస్తే భూమిలోని పోషకాలు తెలుస్తాయంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరిరూరల్)

వ్యవసాయ భూమిలో సరైన పద్ధతిలో భూసార పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఎకరం పొలంలో ఒక మూర నుంచి సుమారు 2-3 అడుగుల దూరాన్ని వదిలి 'వి' ఆకారంలో 6 అంగుళాల లోతు గుంత తవ్వి అడుగు నుంచి మూలల వైపు ఉన్న మట్టిని సేకరించాలి. ఇదే విధానంలో 6 నుంచి 8 చోట్ల జిగ్‌జాగ్ పద్ధతిలో 6 నుంచి 7 కిలోల మట్టిని సేకరించాలి. మట్టిని నీడలో కాగితం సంచులో లేదా వస్త్రంపై వేసి సన్నని చూర్ణంగా చేయాలి. అదేవిధంగా పాలథిన్ కవర్‌లో వేసి మూట కట్టి కేంద్రంలో అందించాలి. సేంద్రియ కార్బనం, నత్రజని, బాస్వరం, పొటాషియం, జింక్, సల్ఫర్, కాల్షియం తదితర భూమిలో ఎంత మొతాదులో ఉన్నాయని తెలుస్తాయి.

నమోదు ఇలా

మట్టి నమూనాలను సేకరించి నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని భూసార పరీక్ష కేంద్రం, హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, భూసార పరీక్ష కేంద్రానికి ఈ నమూనాలను తరలించి వాటి ఫలితాల ఆధారంగా పంటల సాగు చేసుకోవాల్సి ఉంటుంది. భూసార కేంద్రానికి రైతు పేరు, తండ్రి పేరు, సర్వేనెంబర్, పొలం వివరాలు, గతంలో సాగు చేసిన పంట, వాడిన ఎరువులు, పురుగు మందులు, వచ్చే సీజన్‌లో సాగు చేసే పంటల వివరాలను ఓ కాగితంపై రాసి వ్యవసాయ అధికారులకు ఇవ్వాలి.

ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ఫలితాలను ఉచితంగా పొందవచ్చు.





భువనగిరిలో భూసార పరీక్షల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏవో గోపాల్, ఏరువాక శాస్త్రవేత్త అనిల్‌కుమార్(ఫైల్‌ఫొటో), భూసార పరీక్షలకు పొలంలో మట్టిని సేకరిస్తున్న ఏఈవో(ఫైల్‌ఫొటో)

భూసార పరీక్ష ఆధారంగా అధిక దిగుబడులు

భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు, పురుగుల మందులు వాడినట్లయితే అధిగ దిగుబడులు సాధించే అవకాశం ఉంది. మే నెల మొదటి వారం నుంచి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో క్లస్టర్ పరిధిలోని ఏఈవోలు మట్టి నమూనాలను సేకరిస్తారు. గతంలో సాగు చేసిన పంట వాడిన ఎరువులు, మందులు వివరాలను నమోదు చేసుకుంటారు. భూసార పరీక్షకు సంబంధించి మట్టిని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ వ్యవసాయ పరీక్ష కేంద్రానికి లేదా మిర్యాలగూడ భూసార పరీక్ష కేంద్రానికి తరలించి అక్కడి నుంచి సంబంధిత రైతుల ఫలితాల వివరాలు వెలువడుతాయి. రైతులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ఉచితంగా భూసార పరీక్షల ఫలితాలను పొందవచ్చు.



డాక్టర్ బీ అనిల్‌కుమార్, ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త , యాదాద్రి భువనగిరి జిల్లా

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	515
టీఎంసీలు	140.3150
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,350 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	1,350 క్యూసెక్కులు

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.40 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	200 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	4000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	627.30 అడుగులు
టీఎంసీలు	1.07
కాల్వలకు విడుదల	నిల్
ఇన్‌ఫ్లో	313.77 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	58.67 క్యూసెక్కులు

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను పంచామృతాలతో అభిషేకించి, తులసిదళాలతో అర్చించారు. సుదర్శన హోమం, నిత్యకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వైభవంగా జరిపారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.31,78,739 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా హైదరాబాద్ (మాసాబ్‌ట్యాంక్)కు చెందిన బిరదవోలు వర్రశ్రీ రూ.7.70లక్షల విలువైన (7కిలోల వెండి) 11 వెండి కలశాలతో పాటు ఏక, ధూపహారతులు, హైదరాబాద్‌కు చెందిన మరో దాత డాక్టర్ బీవీఎస్ రాంప్రసాద్ రూ.1.10లక్షల విలువైన రెండు(ఒక కిలో వెండి) వెండి కలశాలు ఆలయ ముఖ మండపంలో ఈవోకు అందజేశారు. స్వామివారిని గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకొని ఆలయంలోని స్వామిఅమ్మవార్లకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

కమణీయం లక్ష్మీనరసింహుని కల్యాణం

మఠంపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో శనివారం నిత్యకల్యాణాన్ని వేద పండితులు కమణీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. దివ్యమూర్తులకు పురవీధుల్లో గరుడోత్సవం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ పాల్గొన్నారు.



గరుడోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

బహిరంగ వేలం

మట్టపల్లి క్షేత్రంలో కిరాణం జనరల్ అండ్ ఫ్యాన్సీ సామగ్రి విక్రయించుకునే హక్కుకు శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన కె.నవీన్‌కుమార్ రూ.4,85,000లకు పాటపాడి వేలం దక్కించుకున్నారు.

బీ.వెల్లెంల రిజర్వాయర్‌లోకి నీటి విడుదల



నార్కట్‌పల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి రిజర్వాయర్‌కు శనివారం నీటిని విడుదల చేశారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో భూగర్భ జలాల మట్టం పడిపోతూ తాగునీటి సమస్య నెలకొంటున్న నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచనలు, కలెక్టర్ ఆదేశాల మేరకు రిజర్వాయర్‌లోకి ప్రాజెక్టు ఇంజనీర్లు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరడంతో 0.01 టీఎంసీ పరిమాణం మేరకు ఒక మోటారును నడిపించడం ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో 0.01 టీఎంసీ నీటిని రిజర్వాయర్‌లోకి విడుదల చేయనున్నట్లు ఇంజనీర్లు చెబుతున్నారు.

అందాల భామలకు ఉమ్మడి జిల్లా ఆతిథ్యం

(1వ పేజీ తరువాయి)

నిలవనుంది. పోటీల్లో భాగంగా నిర్వహించే ఫ్యాషన్ రౌండ్, సాంస్కృతిక ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాల్లో పోటీదారులు చేనేత వస్త్రాలు ధరించనున్నారు. అందుకోసం సంప్రదాయ, ఆధునిక డిజైన్ల కలయికతో చేనేత ఇక్కత్ వస్త్రాలను సిద్ధం చేస్తున్నారు. అంతేగాక మిస్‌వరల్డ్ టాప్ మోడల్ అండ్ ఫ్యాషన్ ఫినాలేలో సైతం చేనేత వస్త్రాలు ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. పోచంపల్లిని సందర్శించే ప్రపంచ సుందరీమణులు, వివిధ దేశాల ప్రతినిధులు యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటారు. ప్రపంచ సుందరీమణుల బృందం చేనేత వస్త్రాలు ధరించేందుకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. అంతేగాక అతిథులకు బహుమతిగా చేనేత వస్త్రాలనే బహూకరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. పోచంపల్లి, యాదగిరిగుట్ట సందర్శించే విదేశీ ప్రతినిధుల బృందాలు ధరించే చేనేత వస్త్రాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా వీడియో ఆల్బమ్ రూపొందిస్తోంది. దీంతో తెలంగాణ చేనేత కళకు మరింత ప్రాచుర్యం లభించి నేత కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

మే 12న విజయవిహార్‌లో విడిది

ప్రపంచ దేశాల బౌద్ధులను ఆకర్షించేందుకు నాగార్జునసాగర్‌లోని కృష్ణానది తీరంలోని బుద్ధవనాన్ని ప్రపంచ సుందరీమణులు మే 12న దర్శించనున్నారు. బౌద్ధుల చరిత్ర, ఈ ప్రాంత ప్రాశస్త్యాన్ని వారు తెలుసుకోనున్నారు. వారికి ఇక్కడి బౌద్ధసంస్కృతిని పరిచయం చేయడంతోపాటు అంతర్జాతీయంగా పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందేలా తెలంగాణ పర్యాటకశాఖ ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. మిస్‌వరల్డ్ పోటీదారులు నాగార్జున సాగర్‌లో విడిది చేసేందుకు విజయవిహార్‌లోని గదులను ఆధునీకరిస్తున్నారు. రూ.5కోట్ల వ్యయంతో అన్ని హంగులు కల్పిస్తున్నారు. ప్రపంచ సుందరీమణులకు విజయవిహార్ వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నారు.

ఆధ్యాత్మిక నగరికి

అందాల భామలు మే 15న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి వారిని దర్శించుకోనున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 2గంటల వరకు ఇక్కడ ప్రపంచ సుందరీమణులు ఆగనున్నారు. వారు 15వ తేదీన హైదరాబాద్ నుంచి భూదాన్ పోచంపల్లి చేరుకుని చేనేత థీమ్ సందర్శిస్తారు. అనంతరం పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాలు ధరించి ర్యాంప్‌షో నిర్వహించనున్నారు. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు ధరించిన సుందరీమణులు నేరుగా యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుంటారు. ముందుగా కొండకు దిగువన ఉన్న ప్రెసిడెన్షియల్ సూట్‌కు చేరుకుని, అక్కడి నుంచి యాదగిరి క్షేత్రానికి వస్తారు. విష్ణు పుష్కరిణిలో సంకల్ప పూజలు నిర్వహించి, ప్రధానాలయం సమీపంలో ఉన్న అఖండ దీపారాధన పూజల్లో పాల్గొంటారు. లక్ష్మీనృసింహస్వామి దర్శనం తర్వాత ప్రధానాలయం పునర్నిర్మాణాన్ని మిస్‌వరల్డ్ కంటెస్టెంట్స్ పరిశీలించి, ఇక్కడే ఒక డాక్యుమెంటరీ సైతం చేయనున్నట్లు సమాచారం. మిస్‌వరల్డ్ పోటీదారులతో యాదగిరిగుట్ట క్షేత్ర వైభవం ప్రపంచస్థాయికి చేరనుంది.

పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్‌కు బ్రాండ్ ఇమేజ్



ప్రపంచ సుందరీమణులు మే 15న పోచంపల్లిని సందర్శించనున్న నేపథ్యంలో పోచంపల్లి చేనేత ఇక్కత్ బ్రాండ్ ఇమేజ్ ప్రపంచ దేశాల్లో గుర్తింపు తేనుంది. ఇప్పటికే విలక్షణమైన చేనేత విధానంతో ఖండాంతర ఖ్యాతిగాంచిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్‌కు ప్రపంచ వ్యాప్తంగా మరింత ప్రాచుర్యం లభించనున్నది. దీంతో పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ ఇమేజ్ విశ్వవ్యాప్తం కానున్నది. రాష్ట్ర ప్రభుత్వం మిస్‌వరల్డ్ పోటీదారులను పోచంపల్లికి సందర్శింపజేయడంతో ఈ ప్రాంతం సైతం ప్రపంచ దేశాల్లో మంచి గుర్తింపు పొందుతుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోచంపల్లి ఇక్కత్‌కు ప్రాచుర్యం కలుగుతుంది. దీంతో చేనేత కార్మికులకు సైతం మరింత ఉపాధి లభిస్తుంది.

భారత లవకుమార్, పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు

భవనం పైనుంచి పడి తాపీమేస్త్రీ మృతి

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పంప్‌హౌజ్ భవనంపై నిర్మాణ పనులు చేస్తూ.. కిందపడిన ఓ తాపీమేస్త్రీ మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం అబ్బనబోయినగూడేనికి చెందిన నర్ర నర్సింహ తాపీ మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. పీఏపల్లి మండలం కోదండపురం పంప్‌హౌజ్‌లోని ఫేస్-1 భవనం లీకేజీతో నీరు కారుతుండడంతో ఆ భవనంపై నీరు కారకుండా మళ్లీ ఐరన్‌తో స్లాబ్ పోయడానికి పని కుదుర్చుకున్నాడు. మూడు రోజులుగా స్లాబ్ పనులు చేస్తున్నారు. రోజులాగే శని వారం భవనంపైకి తాపీ మేస్త్రీ నర్ర నర్సింహ ఎక్కి భవనంపై స్లాబ్ పోస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ యాదగిరి తెలిపారు.

వ్యవసాయ బావిలో బాలుడు గల్లంతు

సూర్యాపేటరూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లి బాలుడు గల్లంతయ్యాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని కేసారం గ్రామంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి పల్లె వెంకన్న లలిత దంతుల కుమారులు పల్లె మహేందర్(10), పల్లె వేణు ఇద్దరు అన్నదమ్ములు కలిసి మరో ఇద్దరి స్నేహితులతో గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లారు. అన్నదమ్ములు ఇద్దరికీ ఈత రాకపోవడంతో సరదాగా బావి ఒడ్డున కూర్చుని చూస్తున్నారు. ఇద్దరు అనుకుని మనం కూడా ఈత కొడదామని బావిలో దుకారు. ఈత రాక మునిగిపోతున్న అన్నదమ్ములను ఈత కొడుతున్న స్నేహితులు గమనించి తమ్ముడు వేణును ఒడ్డుకు చేర్చారు. అప్పటికే మహేందర్ నీటిలో మునిగిపోయాడు. స్థానికుల సమాచారంతో ఫైర్ సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారు.

కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మఠంపల్లి, ఏప్రిల్ 19, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి గ్రామశివారులో కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం శనివారం లభ్య మైంది. మఠంపల్లి ఎస్‌ఐ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపల్లి గ్రామ శివారు లోని నదిలో మృతి చెందిన వ్యక్తి వయస్సు 40 ఏళ్ల ఉంటుందని పేర్కొన్నారు. మృత దేహం నీటిలో ఉండటం వల్ల కుళ్లిపోయి దుర్వాసన వస్తుందని, చనిపోయి 2,3 రోజులు ఉండవచ్చని ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

- రెండు కిలోల గంజాయి పట్టివేత
- పరారీలో మరొకరు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో కొద్ది రోజులుగా గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి ఆ వ్యక్తి నుంచి సుమారు 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. డీఎస్పీ కె.శివరాంరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం కగారియా జిల్లాకు చెందిన రాకేష్‌కుమార్ ఇంటర్ వరకు చదువుకున్నాడు. ఆ తర్వాత చదవడం ఇష్టం లేక మానివేశాడు. అనంతరం సూర్యాపేటకు వచ్చి అక్కడ ఓ రైస్ మిల్లులో హమాలీగా పనిచేస్తున్నాడు. రాకేష్‌కుమార్‌కు గంజాయి తాగడం అలవాటు ఉంది. దీంతో బీహార్ నుంచి వచ్చేటప్పుడు తాగడానికి గంజాయి తెచ్చుకునేవాడు. సూర్యాపేటలో పని మానేసి ఏడాది కాలంగా నల్లగొండలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న వేంకటేశ్వర మిల్లులో హమాలీగా పనిచేస్తున్నాడు. గంజాయి అలవాటుతో ఏ పని చేతకాకపోవడంతో గంజాయి తెచ్చి నల్లగొండలో అమ్మితే డబ్బులు వస్తాయని భావించాడు. బీహార్ రాష్ట్రంలోని కగారియా జిల్లాలోని దమారా రైల్వేస్టేషన్ దగ్గరలో ఉండే పప్పుయాదవ్ దగ్గర గంజాయిని కిలో రూ. 12500 కొనుగోలు చేసి నల్లగొండకు తీసుకువచ్చేవాడు. చిన్న ప్యాకెట్లలో పెట్టి గంజాయి తాగే వారికి ఒక్కో ప్యాకెట్ రూ.300 చొప్పున విక్రయించేవాడు. నిందితుడు రాకేష్‌కుమార్ కొద్ది రోజుల క్రితం సొంత గ్రామానికి వెళ్లి తిరిగి నల్లగొండకు వచ్చే సమయంలో పప్పుయాదవ్ దగ్గర రెండు కిలోలు గంజాయి కొనుగోలు చేశాడు. సికింద్రాబాద్ నుంచి నల్లగొండకు రైలులో వచ్చి దిగుతుండగా ఈ నెల 18న సాయంత్రం 4.30 గంటలకు పోలీసులు పట్టుకున్నారు. రాకేష్ కుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశామని, పప్పుయాదవ్ పరారీలో ఉన్నాడని డీఎస్పీ వెల్లడించారు. నిందితులను పట్టుకున్నందుకు టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, ఎస్‌ఐ సైదులు, సిబ్బంది శంకర్, బాలకోటిలను ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

అప్రైజర్స్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా విజయ్‌కుమార్

నల్లగొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యాంకు ఆఫ్ బరోడా అప్రైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూరెళ్ల విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్లగొండలో శనివారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూరెళ్ల విజయ్‌కుమార్, సెక్రటరీగా దాసోజు నర్సింహాచారి, ఉపాధ్యక్షులు ముత్తినేని కిరణ్, పాలవరపు శ్రీనివాస్, కోశాధికారి తాడూరి వేణు, సహాయ కార్యదర్శులు జిల్లేపల్లి సురేందర్, ఉరిమిల్ల నరేష్, కార్యవర్గ సభ్యులుగా సతీ"ష, నగేష్, సతీష్‌కుమార్, యశ్వంత్‌ను ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారుడిగా చొల్లేటి ఓంప్రకాశ్ ఉన్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

- హాస్టల్ భవనంపై నుంచి దూకిన వైనం
- గేట్ ఇంజనీరింగ్ కళాశాలలో విషాదం

చిలుకూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిధిలోని గేట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగింది. పోలీసులు, మృతురాలి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం... మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన గంగాధరి లింగయ్య, లక్ష్మి దంపతుల రెండో కుమార్తె గంగాధరి కృష్ణవేణి(21) మండల పరిధిలోని గేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం(సీఎస్ఈ) చదువుకుంటూ కళాశాల హాస్టల్‌లోనే ఉంటోంది. కళాశాల హాస్టల్‌కు మార్చి 29న ఉగాది పండుగ సందర్భంగా సెలవులు ప్రకటించడంతో స్వగ్రామానికి వెళ్లింది. సెలవులు ముగిసిన తర్వాత శుక్రవారం రాత్రి తన తల్లి లక్ష్మితో కలిసి రాత్రి 9గంటల సమయంలో కళాశాలకు వచ్చింది. రాత్రి పొద్దు పోవడంతో తల్లి లక్ష్మి కూడా కుమార్తె కృష్ణవేణితో కలిసి హాస్టల్‌లోనే తన కుమార్తెతో పాటు బస చేశారు.

తెల్లవారుజామున సుమారు ఆరు గంటల సమయంలో వాష్ రూంకి వెళ్లి వస్తానని గది నుంచి బయటికి వెళ్లిన కృష్ణవేణి హాస్టల్ పైనుంచి కిందికి దూకింది. దీంతో కృష్ణవేణి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. కృష్ణవేణి భవనం పైనుంచి దూకిన విషయం గమనించిన తోటి విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి, పోలీసులకు తెలిపారు. అప్పటి వరకు తనతో పాటు ఉన్న కుమార్తె అకస్మాత్తుగా భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడంతో తల్లి లక్ష్మి బోరున విలపించింది. రాత్రి తనతో పాటు కళాశాల


కృష్ణవేణి (ఫైల్)

హాస్టల్‌కు వచ్చిన కృష్ణవేణి ఎందుకు ఆత్మహత్యకు చేసుకుందో తనకు తెలియదని, కళాశాలలో గానీ, ఇంటివద్ద గానీ ఎటువంటి సమస్యలు లేవని, తనకు ఇబ్బంది ఉన్నట్లు తన కుమార్తె తనకు ఎప్పుడూ చెప్పలేదని కృష్ణవేణి తల్లి విలపిస్తూ రోదించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ సురభి రాంబాబు మృతురాలి స్నేహితులు, తల్లి లక్ష్మి నుంచి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చదువులో వెనుకబడడంతో పాటు వ్యక్తిగత కారణాలతో తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని కృష్ణవేణి తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

కోదాడ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కొమరబండ గ్రామం వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామానికి చెందిన నేరెళ్ళ సైదులు (56) ఇటీవల వీచిన ఈదురుగాలుల వల్ల తనకున్న మామిడితోటలో మామిడికాయలు రాలిపోవడంతో సూర్యాపేట మార్కెట్‌లో విక్రయించేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా, కొమరబండ వద్ద హైదరాబాద్-విజయవాడ వెళ్తున్న లారీ ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్ మీదున్న సైదులు అక్కడికక్కడే మృతిచెందగా, కుమారుడు సాయికి గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

● గరిడేపల్లి: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో జరిగింది. శ నివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడి వివరాలు లభించకా పోలీసులు గుర్తు తెలియని శవంగా కోదాడ ప్రభుత్వ హాస్పటల్ మార్చురీలో శవాన్ని భద్రపరిచారు. మోతే మండలం కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన దుశ ర్ల రాము (35) నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామానికి చెందిన బంధువుల ఇంట్లో వివాహానికి తన బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా నేరేడుచర్ల వైపు నుండి వ స్తున్న కారు మండలంలోని అప్పన్నపేట గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు బైక్‌పై ఉన్న దుశర్ల రాము బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయి న రామును 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా హాస్పటల్‌కు తరలించగా మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ఏరియా హాస్పటల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో రాము మరణి ంచాడని మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనర్సయ్య తెలిపా రు. మృతుడికి ఇద్దరు కుమారులు భార్య ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. యువకుడి

పెద్దఅడిశర్లపల్లి : బైక్ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిలో గల మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ సమీపంలో శనివారం జరిగిన పోలీసులు, స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మం డలం తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన మేడి ప్రవీణ్(28) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. పెద్దవూర మం డలం సంగారంలో శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. సంగారం నుంచి ఘనపురం ఎక్స్‌రోడ్డుకు తన బంధువులను బైక్‌పై ఎక్కించుకుని వచ్చి ఘనపురం ఎక్స్ రోడ్డు వద్ద దించాడు. తిరుగు ప్రయాణంలో మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ వద్దకు రాగానే బైక్ అద పు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ పైన ఉన్న ప్రవీణ్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతు డికి భార్య ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ యాదగిరి తెలిపారు.

మనస్తాపంతో మహిళ బలవన్మరణం

నాగారం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): భూ తగాదాలతో మనస్తాపం చెందిన మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని ఫణిగిరిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఫణిగిరి గ్రామానికి చెందిన వట్టె భద్రమ్మ(45)కు ఇద్దరు కూమారులు ఉన్నారు. పెద్ద కూమారుడు 20 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు భార్య, ఒక కూతురు ఉంది. పెద్ద కూమారుడు మృతిచెందడంతో అతనిని వాటా కింద వచ్చిన భూమిని కోడలు విజయకు నాలుగు ఎకరాలు పట్టా చేయించి కొంత నగదు ఇచ్చారు. భద్రమ్మ భర్త పేరున రెండు ఎకరాల భూమి ఉంది. చిన్న కూమారుడు పేరున ఉన్న ఆరు ఎకరాల భుమిలో తనకు వాటా ఇవ్వాలని పెద్ద కోడలు వట్టె విజయ గ్రామ పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టింది.

వాటాల విషయంలో కోడలికి చిన్నకుమారుడికి మధ్య పంచాయితీ తేలకపోవడంతో మనస్తాపానికి గురైన వట్టే భద్రమ్మ లోనై శుక్రవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి గ్రామ సమీపంలో పురుగు మందు సేవించి మృతిచెందింది. చిన్న తన తల్లి కనిపించడంలేదని కూమారుడు వట్టే పుల్లయ్య తెల్లవారుజామున గ్రామస్థులతో కలిసి గాలిస్తుండగా గ్రామసమీపంలో పొలంలో పురుగుమందు తాగి విగతజీవిగా మృతిచెందిన తల్లిని చూసి రోదించాడు. తన తల్లి మృతికి కారణం తన వదిన వట్టె విజయ, గ్రామ పెద్ద మనుషులే కారణం అని ఆరోపించాడు. పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తి కావడంతో రాత్రి గ్రామంలో పోలీసుల బందోబస్తు మధ్య అంత్యక్రియలు జరిగాయి.

మఠంపల్లిలో ఇద్దరు వ్యక్తుల అదృశ్యం

మఠంపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేం ద్రంలోని ఎస్సీకాలనీ చెందిన వ్యక్తి మంచ్యా తండాకు చెందిన యువకుడు అదృశ్యమ య్యాడు. మఠంపల్లి ఎస్సీకాలనీ చెందిన కందుల వెంకన్న వయస్సు 41 వృత్తి టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 15న ఎవరికీ సమా చారం ఇవ్వకుండా ఇంటి నుంచి వెళ్లి పోయాడు. కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులు, తెలిసిన వారికి సమాచారం ఇచ్చిన రాలేదని తెలపడంతో భార్య కందులనాగలక్ష్మి శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని మంచ్యాతండా చెందిన సపావత్ పున్న నాయక్(22) ఈనెల 5నతండ్రి శ్రీను హైద రాబాద్‌కు వెళ్తామని చెప్పాడు. ముందు మీరు వెళ్లండి తరువాత నేను వస్తా అని తెలుపడంతో భార్యతో కలిసి శ్రీను వెళ్లిపోయాడు. కానీ సదరు వ్యక్తి హైదరాబాద్ రాక ఇంటివద్ద లేక ఎక్కడికి వెళ్లిపోయాడు. పున్న వెళ్లిపోయి రెండు వారాలు కావడంతో కు టుంబ సభ్యులు ఇళ్లకు, బంధుమిత్రుల ఇళ్లకు, స్నేహితు లు సమాచారం తెలిపిన ఆచూకీ లేకపోవడంతో తండ్రి శ్రీను శనివారం మఠంపల్లి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మండలంలో ఇద్దరు అదృశ్యమైన సంఘ టనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాబు తెలిపారు.


పున్న, కందుల వెంకన్న

హుజూర్‌నగర్‌లో కుమారుడితో కలిసి తల్లి

హుజూర్‌నగర్ : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని సుందరయ్యనగర్ కాలనీకి చెందిన ఓ మహి ళ ఆమె కుమారుడు కనిపించడం లేదుని ఏఎస్‌ఐ కె. బాలరాంరె డ్డి తెలిపారు. హుజూర్‌నగర్‌కు చెందిన పిట్టల గోపి, రమ్య దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా రమ్య ఈ నెల 18న కుమారుడు(18 నెలలు) నవీన్‌తో కలిసి బయటకు వెళ్లి వస్తానని వెళ్లింది. తిరిగి రాకపోవడంతో ఆమె భర్త గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.


రమ్య(ఫైల్)

విద్యుత్ తీగలు తగిలి గడ్డి దగ్ధం

పెద్దఅడిశర్లపల్లి,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న గడ్డి కట్టలు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం దుగ్యాల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. విద్యుత్ ఏఈ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుగ్యాల గ్రామానికి చెందిన రైతు గడ్డి కట్టలను అజ్మపురం గ్రామానికి చెందిన రైతు కొనుగోలు చేసి ఆ కట్టలను ట్రాక్టర్‌లో లోడుచేసుకుని వెళ్తుండగా గ్రామ సమీపంలోకి రాగానే విద్యుత్ తీగలు గడ్డి కట్టలకు తాకడంతో మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు పెద్దవి కావడంతో డ్రైవర్ అప్రమ త్తంతో ట్రాలీ లేపడంతో కట్టలు కిందపడ్డాయి. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.దీంతో ట్రాక్టర్‌కు పెద్ద ప్రమాదం తప్పింది. మరో ఘటనలో అదే గ్రామంలో ట్రాక్టర్‌లో అధిక మొత్తంలో కట్టలు లోడ్‌చేయడంతో కట్టలు విద్యుత్ తీగలకు తాకి విద్యుత్ స్తంభం విరిగిపోయింది. ఆ సమయంలో విద్యుత్ లేకపోవడంతో పేనుప్రమాదం తప్పింది.


తగలపడుతున్న గడ్డికట్టలు


డ్రైవర్ల పని గంటలపై భిన్నాభిప్రాయాలు

● సుప్రీం ఆదేశాలు అమలయ్యేనా

రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు రోజుకు 8పని గంటల విధానాన్ని అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆరు నెలలలో మార్గదర్శకాలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఇటీవలే సూచించింది. డ్రైవర్‌పై పెరుగుతున్న ఒత్తిడితోనే రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని జస్టిస్ అభయ్ ఒకా, జస్టిస్ ఉజ్జల్ బయాన్‌తో కూ డిన ద్విసభ్య ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రమాదాల్లో గాయపడిన డ్రైవర్లకు సత్వర చికిత్స కూడా అందడం లేదని విచారం వ్యక్తం చేసింది. డ్రైవర్ల పని గంటలపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో సమావేశాలు నిర్వహించి చర్చించాలని కేంద్ర రో డ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖకు సూచించింది. అయి తే సుప్రీంకోర్టు నిర్దేశిస్తున్న ఎనిమిది గంటల పని విధానంపై క్షే త్రస్థాయిలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

● భువనగిరిటౌన్, ఆంధ్రజ్యోతి

రవాణారంగంలో పని గంటల సాధ్యం కాదు



రవాణా రంగంలో పని గంటల విధానం సాధ్యం కాదు. దూర ప్రాంతాలకు సరుకులను రవాణా చేసే వాహనాల డ్రైవర్లకు రోజుకు 8గంటల పని విధానంతో డ్రైవర్లకు వేతన పరంగా, రవాణా రంగానికి, యజమానులకు తీరని నష్టం. సకాలంలో సరుకులను గమ్యస్థానాలకు చేర్చడం కూడా అసాధ్యమవుతుంది. అయితే రోజంతా డ్రైవర్లు వాహనాలను నడపరని, అవసరం మేరకు విశ్రాంతి తీసుకుంటారని కోర్టుతో సహా అధికారులు గ్రహించాలి.

● టీ యాదవ్, అధ్యక్షుడు, వినాయక లారీ ఓనర్స్ అసోసియేషన్ భువనగిరి


పని గంటల విధానం భేష్



డ్రైవర్లకు 8 గంటల పని విధానం భేష్. సంఘటిత, అసంఘటిత రంగాలలోని ఉద్యోగులు, కార్మికులకు పని గంటల విధానం అమలవుతుండగా డ్రైవర్లకు మాత్రం పని గంటల విధానం లేకపోవడం ప్రమాదకరంగా మారుతుంది. పని గంటల విధానం అమలు చేయకుంటే దూర ప్రాంతాలకు వెళ్లే సరుకు వాహనాలకు ఇద్దరు డ్రైవర్లను ఏర్పాటు చేయాలి. ఆర్టీసీలో పని గంటల విధానం అమలవుతుంటంతోనే మిగతా వాహనాలతో పో లిస్తే బస్సు ప్రమాదాలు తక్కువగా ఉంటున్నాయి.

● ధరావత్ ధర్మానాయక్, ఆర్టీసీ డ్రైవర్


సుప్రీంకోర్టు నిర్ణయాన్ని అమలుచేయాలి



డ్రైవర్లకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్న సుప్రీంకోర్టు సిఫార్సులను రవాణా రంగాలు అమలుచేయాలి. దూర ప్రాంతాలకు వెళ్లే డ్రై వర్లు సరుకులను సకాలంలో చేర్చేందుకు మితిమీరిన వేగం, విశ్రాంతి లేకుండానే వాహనాలను నడపాల్సి వస్తుంది. ప్రమాదాలకు గురవుతున్న డ్రైవర్ల కు, బాధితులకు సకాలంలో చికిత్సలు కూడా అందించేలా చర్య లు తీసుకోవాలి.

● బందెల రాము, ట్రక్కు డ్రై వర్, భువనగిరి

క్షీణిస్తున్న డ్రైవర్ల ఆరోగ్యం



వాహనం ప్రారంభమైనప్పటి నుంచి గమ్యం చేరే వరకు డ్రైవర్ ఒత్తిడికి గురవుతుంటాడు. తాను ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్నా ఎదురుగా ఉన్న వాహనాలు, ఇతరుల తప్పిదాల కారణంగా ప్రమాదాలకు గురికావాల్సి వస్తుంది. పనికి తగిన విశ్రాంతి, సకాలంలో భోజనం లభించకపోవడం, కుటుంబాలకు దూరంగా గడపాల్సి వస్తుండటంతో పలువురి డ్రైవర్ ఆరోగ్యం క్షీణిస్తున్నది. ఎనిమిది గంటల పని విధానం ఆచరణలో ఇబ్బందులు ఉన్నా కొన్ని సవరణలతో విధి, విధానాలు రూపొందిస్తే మంచిది.

● పట్బూరి భరత్, డ్రైవర్, భువనగిరి

డబుల్ లైన్‌కు మోక్షమెప్పుడో?


నల్లగొండ జిల్లాలోని ష్ణుపురం రైల్వేస్టేషన్,


విష్ణుపురం వద్ద నూతన రైల్వే లైన్ ఏర్పాటు జరగనున్న ప్రాంతం

- మోటుమర్రి టు విష్ణుపురం రైల్వే డబ్లింగ్
- ఆమోదం లభించినా ప్రారంభం కాని పనులు
- పూర్తయితే ప్రయాణం సుగుమం

దామరచర్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని విష్ణుపురం నుంచి ఖమ్మం జిల్లా మోటుమర్రి రైల్వే జంక్షన్ వరకు 88.81 కిలోమీటర్ల మేర డబుల్ రైల్వేలైన్ ఏర్పాటుకు ఈ ఏడాది ఫిబ్రవరి 8న కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో సికింద్రాబాద్ నుంచి గుంటూరు, ఖాజీపేట నుంచి విజయవాడ రైలు మార్గాలను కలిసి ఉంటుంది. ఈ రైల్వే మార్గం పూర్తయితే రెండు తెలుగు రాష్ట్రాలలోని సుమారు 90 మండలాల ప్రజలకు రైల్వే ప్రయాణం సుగుమం కానుంది. ఈ మార్గంలోని ఆయా ప్రాంతాల ప్రజలు రైలులో ప్రయాణించే వీలుంటుంది. నిత్యం వేలాది మంది ప్రయాణానికి అనుకూలంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అనుకున్న సమయానికి గమ్యం చేరడంతో పాటు డబ్బు ఆదా అవుతుందని ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు.

ప్రయాణం సుగుమం

సిమెంట్, ఇతర పరిశ్రమలతో మూడు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది కార్మికులు దామరచర్ల మండలంలోని పరిసర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమల్లో ఉపాధి పొందుతున్నారు. దీనికి తోడు ఆరేళ్లుగా యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ నిర్మాణంలో సుమారు 12 వేలకు పైగా కార్మికులు భాగస్వాములయ్యారు. వీరు ప్రధానంగా ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు రైలు మార్గాన్ని ఎంచుకుంటారు. ప్రస్తుతంమోటుమర్రి నుంచి విష్ణుపురం వరకు రైలు మార్గం డబ్లింగ్ పనులు చేపట్టి పూర్తయితే ఈ మార్గంలో అధికసంఖ్యలో ప్రయాణిస్తుంటారు.

ప్రారంభం కాని పనులు

మోటుమర్రి నుంచి విష్ణుపురం వరకు డబుల్ రైల్వేలైన్ పనులకు కేంద్రం ఆమోదించి రెండున్నర నెలలు అవుతున్నా పనులు ప్రారంభం కాలేదు. విష్ణుపురం వద్ద ఎలాంటి పనులు చేపట్టలేదు. ఈ విషయమై సంబంధిత అధికారులను సంప్రదించగా పనులపై ఎలాంటి స్పష్టత లేదు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి



మోటుమర్రి నుంచి విష్ణుపురం డబుల్ రైల్వేలైన్ పనులు త్వరగా పూర్తి చేస్తే ప్రయాణ ఖర్చులు తగ్గడంతో పాటు నిర్ణీత గడువులో గమ్యస్థానానికి చేరుకుంటాం. అధికారులు ఆ దిశగా పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలి.

● వెంకట్రావు, కార్మికుడు

ఒకే కాన్పులో ముగ్గురు శిశువుల జననం



సూర్యాపేటటౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీహాస్ ఆసుపత్రిలో శనివారం ఓ కాన్పులో ముగ్గురు శిశువులు జన్మించారు. వైద్యురాలు విజితా గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం రాయినిగూడేనికి చెందిన షేక్ షబానాకు మూడేళ్ల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని శ్రీహాస్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోగా ఆమెకు బీపీ, షుగర్, థైరాయిడ్‌తో బాధపడుతూ ఉండడంతో అడ్మిట్ చేసుకున్నారు. శనివారం షబానాకు ముగ్గురు జన్మించారు. వీరిలో ఇద్దరు మగ, ఒకరు ఆడశిశువుగా ఉన్నారు. వీరంతా 1.8, 15, 1.5 కేజీల బరువుతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు.

పాఠశాలలకు వంట సామగ్రి అందజేత

కనగల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 29 పాఠశాలలకు వంట సామగ్రిని ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంఈవో పద్మ తెలిపారు. పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో శనివారం ఆయా పాఠశాలల హెచ్ఎంలకు వంటసామగ్రిని అందజేసినట్లు ఆమె తెలిపారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు నూతన సామగ్రి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శ్రీనివాస్, సంగీతరావు, జాన్‌ఖాన్, రామకృష్ణమ్మ, విజయలక్ష్మి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేడియం స్టిక్కర్లు అతికించాలి : ఎస్ఐ విష్ణుమూర్తి

కనగల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాత్రి సమయంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ట్రాక్టర్లకు వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లను అతికించాలని ఎస్ఐ విష్ణుమూర్తి సూచించారు. మండలంలోని తిమ్మన్నగూడెం, ఎస్‌లింగోటం ఇసుక ఆన్‌లైన్ పాయింట్లను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఇటీవల ట్రాక్టర్ల వెనుక నుంచి వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని, స్టిక్కర్లు అతికించాలని అన్నారు. అనంతరం డ్రైవర్లకు రోడ్డుభద్రతపై అవగాహన కల్పించారు.

కష్టం వర్షార్పితం

- ఈదురుగాలులు, వర్షానికి వరి, పండ్ల తోటలకు నష్టం
- నేలకొరిగిన వరి పంట, విరిగిన నిమ్మ, మామిడి, బొప్పాయి చెట్లు
- రాలిన మామిడి, నిమ్మ, బొప్పాయికాయలు


గుండ్రాంపల్లిలో విరిగిన బొప్పాయి చెట్లు, నేలరాలిన కాయలు, పండ్లు

చిట్యాలరూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పంట వర్షార్పితమైంది. వాతావరణంలో మార్పులు ప్రకృతి ప్రకోపానికి చిట్యాల మండలంలో శుక్రవారం సాయంకాలం, రాత్రి ఈదురుగాలుల


చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో నేలకొరిగిన వరి పంట

కు పలు గ్రామాల్లో వరిచేలు నేలకొరగగా నిమ్మ, మామిడి, బొప్పాయి చెట్లు విరిగిపోవడంతో ఆయా పంటలను సాగుచేస్తున్న రైతులకు నష్టం వాటిల్లింది. వెలిమినేడు, పిట్టంపల్లి, గుండ్రాంపల్లితో పాటు పలు గ్రా మాల్లో వరిచేలల్లో వరికంకులు ఈదురుగాలులకు నేలకొరిగాయి. వరిధాన్యం నేలరాలింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో పాటు కొంత కొట్టుకుపోయింది. గుండ్రాంపల్లిలో ఈదురుగాలులకు నిమ్మచెట్లు, మామిడిచెట్లు, బొప్పాయి చెట్లు విరిగిపోయాయి. నిమ్మకాయలు, మామిడికాయలు, బొప్పాయికాయలు, బొప్పాయి పండ్లు నేలరాలాయి. కోతకు వచ్చిన వరిచేలు నేలకొరగడంతో వరిసాగు చేసే రైతుల కు తీవ్ర నష్టం వాటిల్లింది. దొంతరబోయిన శ్రీకాంత్‌కు చెందిన సు మా రు 9ఎకరాల్లోని నిమ్మ, మామిడి, బొప్పాయి చెట్లు విరిగిపోగా కాయలు, పండ్లు నేలరాలాయి. అదే గ్రామానికి చెందిన జవ్వాజి లింగస్వామికి చెందిన నిమ్మతోటలోని నిమ్మచెట్లు విరిగిపోగా నిమ్మకాయలు రాలాయి. ఈదురుగాలులు, వర్షాలకు వరిచేలకు, పండ్ల తోటలకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతకు వచ్చిన ధాన్యం, నిమ్మకాయలు, మామిడికాయలు, బొప్పాయికాయలు, పండ్లు నేలరాలడంతో నష్టపోయామని, ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని గుండ్రాంపల్లి బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు అరూరి శ్రీశైలం, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బొడిగె సైదులు, గ్రామశాఖ కార్యదర్శి జిల్లా సత్యం, సీపీఎం రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యుడు అరూరి శ్రీను వేర్వేరుగా డిమాండ్ చేశారు. చిట్యాల మండల పరిధిలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులు, వర్షానికి పలు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం తడిసింది. ఆయా గ్రామాల్లో పలు పార్టీల నాయకులు శనివారం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ పార్టీ నాయకులు జిల్లా లక్ష్మయ్య, సీమ అంజయ్య, బొబ్బల శంకర్‌రెడ్డి, సుర్కంటి మోహన్‌రెడ్డి, అరూరి శంభయ్య, నాతి వెంకట్రామయ్య, దేశబోయిన లింగస్వామి, దేశబోయిన నర్సింహ, నాతి శ్రీనివాస్, పిట్టల స్వామి, కొలను యాదిరెడ్డి, పైళ్ల రఘుమారెడ్డి, భూపాల్, ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'గౌతమి' సంచలన ఫలితాలు


నితిన్‌రెడ్డి శివాజి రితిక్ తేజస్విని

నల్లగొండటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాలలో గౌతమి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు వివిధ కేటగిరీల్లో అత్యుతమ ఫలితాలు సాధించి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వన్నె తెచ్చారు. జి.నితిన్‌రెడ్డి 370, ఎం.శివాజీ 2396, ఐ.రికిత్ 5582, జి.తేజస్విని 6174, ఆర్.శ్రీకర్ 6916, ఎ.శశివంత్ 8468, పి. రాజశేఖర్ 9241, ఎం.సిహాద్రి 10497, ఎం.శ్రీను 10769, డి.పూజిత 11444, కె.జయచంద్ర 12233, ఎస్. భావన 13706, జె.చంద్రకోటి 14923, ఎం.సాత్విక్‌రెడ్డి 15558, బి. శశిధర్ 15688, కె.ప్రణయ్ 17535, ఆర్.శివతేజ 18385, ఎం. అక్షయ్ వర్షిత్ 18797, ఆర్.అభినవ్‌రాథోడ్ 19137 వంటి అత్యుత్తమ ర్యాం కులు సాధించి నెంబర్‌వన్‌గా నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, తోడ్పడిన అధ్యాపకులకు గౌతమి విద్యాసంస్థల డైరెక్టర్లు కాసర్ల వెంకట్‌రెడ్డి, చల్లా వెంకటరమణ, కొమ్మిడి రఘుపాల్‌రెడ్డి, పుట్టా వెంకటరమణారెడ్డి అభినందించారు.

జేఈఈ ఫలితాల్లో 'ప్రగతి' విద్యార్థుల ప్రతిభ


శ్రీనిధి రాథోడ్ అభినవ్ సందీప్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. వివిధ కేటగిరిలలో కళాశాలకు చెందిన విద్యార్థులు బి.శ్రీనిధి రాథోడ్ 79, జె.అభినవ్ 155, కె.సమీర 4738, ఆర్.సందీప్ 4854, కె.స్టాలిన్ 13358, టి.కార్తీక్ 13822, బి.భవాని 14118, డి.సునీల్ నాయక్ 19990 ర్యాంకుల సాధించి సత్తా చాటారు. వీరితో పాటు మరో 95 మంది విద్యార్థులు కూడా అర్హత సాధించారు. ఇంటర్ అత్యధిక మార్కులతో పాటు ఆల్ ఇండియా ర్యాంకులతో పాటు ఉత్తమ ప్రతిభ కనబర్చిన కళాశాల విద్యార్థులు, సహకరించిన తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎ.నరేందర్‌బాబు, ఎన్.శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

డీసీసీబీ చైర్మన్‌ను కలిసిన రవిముదిరాజ్

మునుగోడు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మునుగోడుకు చెందిన టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి నారబోయిన రవిముదిరాజ్ శనివారం డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన రైతులకు అందించేలా కృషి చేయాలని కోరారు. ఆయన వెంట మునుగోడు నాయకులు ఉన్నారు.

మానవాళికి ప్రేమ మార్గాన్ని చూపిన ఏసుక్రీస్తు

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మానవాళికి ఏసుక్రీస్తు ప్రేమ మార్గాన్ని చూపించారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రిస్టియన్ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ ర్యాలీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఏసుక్రీస్తు ప్రపంచ వ్యాప్తంగా శాంతిని ప్రబోధించిన మహాత్ముడని కొనియాడారు. యావత్ మానవాళికి శాంతి, ప్రేమ, దయగుణం ప్రబోధించారని వాటిని ఆచరించి జీవితాలను సుఖమయం చేసుకోవాలన్నారు. దేవరకొండ రోడ్డులోని మరియరాణి కెథ్రిడల్ చర్చీ నుంచి రన్ ఫర్ జీసెస్ ర్యాలీ డీఈవో ఆఫీస్, క్లాక్‌టవర్ సెంటర్, ఎన్జీ కాలేజీ, వివేకానంద విగ్రహం వరకు సాగింది. క్రైస్తవుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పీఠాధిపతి దమన్‌కుమార్, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, క్రిస్టియన్ సంఘాల పెద్దలు క్రిస్టఫర్, మోజెస్, శౌరయ్య, విలియం, రేకల భద్రాద్రి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, దుబ్బ అశోక్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.


రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమంలో పాల్గొన్న క్రిస్టియన్లు

'పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి'

నల్లగొండ టౌన్, రామగిరి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌లో వక్ఫ్‌బోర్డు చట్టానికి వ్యతిరేకంగా అల్లర్లలో హిందువులను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా హిందువుల ఇళ్లల్లోకి చొరబడి హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా అక్కడి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం దారుణమని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి గంజి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, సహకార్యదర్శి జూకూరి సంపత్, నగర అధ్యక్షుడు రాయల కృష్ణయ్య, జిల్లా సంఘటన మంత్రి వంశీ, జిల్లా సేవా ప్రముఖ్ గోవర్ధన్, ధర్మప్రసాద్, కోటగిరి సంతోష్, ప్రకాష్, బజరంగ్‌దళ్ సంయోజక్ నర్సింహ, బల్లెం యాదగిరి, వెంకటయ్య, విజయ్, నాగరాజు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న బజరంగ్‌దళ్ నాయకులు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

నకిరేకల్, ఏప్రిల్ 19, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ పని చేస్తోందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండలంలోని తాటికల్, మంగళపల్లి గ్రామాల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం పలు అభివృది కార్యక్రమాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తాటికల్ గ్రామంలో రూ.25లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, స్కూల్ ప్రహరికి శంకుస్థాపన చేశామని సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి విద్యార్థి చదువుకునే విధంగా పాఠశాలలో అన్ని సౌకర్యాలు సమకూరుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నాగయ్య, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, నాయకులు బచ్చుపల్లి గంగాధర్‌రావు, గాదగోని కొండయ్య, సుధాకర్, కత్తుల వీరూ తదితరులు పాల్గొన్నారు. చిట్యాల మండలంలోని ఎలికట్టె, ఏపూర్ గ్రామాల్లో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు.


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కనగల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సీడీపీవో హరిత అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం కనగల్ స్త్రీశక్తి భవనంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పాలు, గుడ్లు, చిరుధాన్యాలు, ఆకుకూరలను సమపాలల్లో తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లి ముర్రుపాలను తాగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయరాం, ఏపీవో సంకు హరి, ఏపీఎం సుధాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, శ్రీలత సీసీలు వసంత, విజయ, ప్రభాకర్, అంగన్‌వాడీటీచర్లు పాల్గొన్నారు.


గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అధికారులు

ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలి

కనగల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కాంటా వేసిన ధాన్యం బస్తాలకు కేంద్రాల్లో పేరుకుపోకుండా మిల్లులకు ఎప్పటికప్పుడు తరలించాలని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మండలంలోని పగిడిమర్రి, జీఎడవల్లి తదితర గ్రామాల్లోని ఐకేపీ కొనుగో లు కేంద్రాలను ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఐకేపీ నిర్వాహకులు సీరియల్ ప్రకారం కాంటాలు వేయాలని ఆదేశించారు. శుభ్రపరిచిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. అదేవిధంగా జీఎడవల్లిలోని ఐకేపీ కేంద్రాన్ని తహసీల్దార్ పద్మ సందర్శించారు. ధాన్యం కొనుగోలు వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం సంకుహరి, సీసీలు ప్రభాకర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.


పగిడిమర్రిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ

అమరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలి

గట్టుప్పల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగే అమరుల సంస్మరణ సభను ఈ నెల 30న జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో శనివారం అమరవీరుల సంస్మరణ సభ జయప్రదం చేయాలని నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో టి.గోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు కర్నాటి మల్లేశం, చాపల మారయ్య, జెర్రిపోతుల ధనుంజయ, శివకుమార్, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దయాకర్ దిష్టిబొమ్మ దహనం

గట్టుప్పల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్థాయి కాదని బీజేపీ మండల అధ్యక్షుడు రావుల ఎల్లప్ప విమర్శించారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్సీ దయాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందేమీ లేదని ఇ ష్టానుసారంగా మాట్లాడడమే ఎంచుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీ జేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు దుర్గయ్య, కంప దుర్గయ్య, జంపల సుధాకర్, పాండు, శంకర్, ఆంజనేయులు, సత్యనారాయణ, వెంకటేశం, శ్రీను, రాజు పాల్గొన్నారు.

వరంగల్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చలో వరంగల్ సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కట్ట వెంకట్‌రెడ్డి, నాయకులు చాడ హరీష్‌రెడ్డి, గుండా శ్రీనివాస్, మామిడి సర్వయ్య, దాసరి నతానియల్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను అమాంతం పెరిగింది

(1వ పేజీ తరువాయి)

పేర్కొంటున్నారు.

హెచ్చుతగ్గులెందుకో?

పౌరసేవలు సులభతరం చేయడం, ప్రభుత్వ ఆదాయ మార్గాలు అన్వేషించడం కోసం రూపొందించిన సాంకేతికత ఆహ్వానించదగినదే. అయితే సదరు సాంకేతికతను వినియోగించడంలో నైపుణ్యం అవసరం. నిర్దేశించిన ప్రాంతాల్లో(పట్టణాల పరిధి) భవనాలు, ఖాళీ స్థలాల వివరాలను సేకరించే భువన్ సాఫ్ట్‌వేర్ మొత్తం ఆవాసాల కొలతలు ఎందుకు సేకరించడం లేదో తెలియని పరిస్థితి. ఒకే అపార్ట్‌మెంట్‌లోని ఒకే విస్తర్ణం ఉన్న ప్లాట్లకు ఆస్తి పన్నును వ్యత్యాసాలు ఉంటున్నాయి. తక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్‌కు ఎక్కువ పన్ను, ఎక్కువ వైశాల్యంతో ఉన్న ప్లాట్‌కు తక్కువ పన్ను వస్తోంది. యంత్ర సేకరణలో లోపమా? సేకరించిన వివరాలను కంప్యూటర్లలో పొందుపరచడంలో తప్పిదమా? అనే అంశాలు బోధపడటం లేదు.

భువనాస్త్రం సంధిస్తున్నారా..?

పురపాలక ఆస్తుల రక్షణ, సొంత ఆదాయ వనరుల సమకూర్చేందుకు రూపొందించిన యాప్‌ను పట్టణాల్లో నివసించే ప్రజలపై భువనాస్త్రంగా సంధిస్తున్నారా? అని ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నారు. ఆస్తుల వివరాలను కచ్చితంగా నమోదు చేసేందుకు పారపాలకశాఖ కసరత్తు చేస్తోంది. అందులో భాగంగానే భువన్‌యాప్‌ను రూపొందించారు. అయితే సదరు యాప్ ప్రభుత్వానికి తీపిగా, ప్రజలకు చేదుగా మారొద్దనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



ఆస్తి పన్ను డిమాండ్ ఎక్కువ వచ్చిందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. భువన్ సర్వే ఇంకా పూర్తి కాలేదు. కొందరు యజమానులు వారి ఇళ్లు, భవనాలను ఇష్టానుసారంగా విస్తరించుకుంటుండగా మరికొందరు కట్టడాలు పూర్తిచేశారు. భువన్ సర్వే వాటిని గుర్తించింది.శాటిలైట్ ఆధారిత మ్యాప్ ద్వారా కచ్చితమైన కొలతలు, అదనపు నిర్మాణాలు, అనుమతిలేని కట్టడాల వివరాలు సేకరించి చర్యలు చేపడతాం.

● మహ్మద్ యూసుఫ్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

రీ అసెస్‌మెంట్ చేయిస్తాం




ఆస్తి పన్ను అదనంగా వచ్చిందని భావించిన యజమానులు కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి. కార్యాలయంలో సంప్రదిస్తే పరిశీలించి తిరిగి ఆస్తిపన్ను ముదింపు చేస్తాం. ఇంటి నిర్మాణ అనుమతి పత్రాలు, మ్యాపు తదితర పత్రాలు సమర్పిస్తే సిబ్బంది వచ్చి మరోమారు కొలతలు సేకరిస్తారు. తేడా ఉంటే ఆస్తి పన్నును సవరిస్తారు. అదనంగా ఉంటే నిబంధనల మేరకు రెట్టింపు పన్ను విధిస్తాం.

● జ్ఞానేశ్వరి, మునిసిపల్ రెవెన్యూ ఆఫీసర్, మిర్యాలగూడ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

1 | ఆదివారం 20 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 24.6



కొలతలు సేకరిస్తున్న భువన్ సర్వే ఉద్యోగులు (ఫైల్)

ఆస్తి పన్ను అమాంతం పెరిగింది

- ఆందోళన వ్యక్తం చేస్తున్న మిర్యాలగూడ పట్టణ ప్రజలు
- 'భువన్ యాప్' వల్లే అంటున్న మునిసిపల్ అధికారులు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన తేలు కిరణ్ ఆస్తి పన్ను చెల్లించేందుకు మునిసిపల్ కార్యాలయానికి వచ్చాడు. 5శాతం తగ్గింపు వస్తుందని భావించిన కిరణ్, వార్డు ఆఫీసర్ (ఆస్తి పన్ను వసూలు చేసే ఉద్యోగి) చెప్పిన మొత్తాన్ని విని బిత్తరపోయాడు. ఎందుకంటే అతను గత ఏడాది ఏప్రిల్‌లో చెల్లించిన మొత్తానికంటే రూ.700 అదనం అది.

● మునిసిపల్ కార్యాలయానికి ఎదురుగా ఉండే బహుళ అంతస్తుల భవనంలో నివసించే మంగతాయారు ముందస్తు ఆస్తి పన్ను (5 శాతం తగ్గింపుతో) చెల్లించేందుకు మునిసిపల్ కార్యాలయంలోని 10వ నెంబరు రూంలోకి వెళ్లింది. ఎప్పటిలాగే ఆర్నెళ్ల కిస్తీలు రెండు చెల్లించేందుకు రూ.1,800 తీసుకెళ్లింది. అయితే బిల్ కలెక్టర్ సంవత్సరానికి ఆస్తి పన్ను రూ.2,510 చెల్లించాలని మిషన్‌లో డిస్‌ప్లే అవుతున్న డిమాండ్‌ను చూపించాడు. దీంతో అవాక్కయిన సదరు మహిళ పన్ను చెల్లించకుండానే వెనుదిరిగింది.

ఇల్లు పాతదే, విస్తీర్ణం అప్పటిదే, కొలతలు నాటివే అయినా ఆస్తి పన్ను అమాంతం పెరిగింది. ఇదేంటని అడిగితే గూగుల్‌లో అలానే వచ్చిందని రెవెన్యూ ఉద్యోగి, భువన్‌యాప్ నిర్ణయించిందని వార్డు ఆఫీసర్ బదులిస్తున్నారు. అయితే అందరికీ పెరగాలి కదా? తమకే ఎందుకు పెరిగిందని అడిగితే శాటిలైట్ సాయంతో భువన్‌యాప్ కొలతలు సేకరించిందని సెలవిస్తున్నారు మునిసిపల్ అధికారులు.

పెరుగుతున్న పన్ను భారం

పట్టణ ప్రజలకు పన్ను భారం పెరుగుతోంది. చాపకింద నీరులా ప్రచారం లేకుండా పెంచుతున్న ఆస్తి పన్ను మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక ప్రభావం చూపుతోంది. పట్టణంలోని అపార్ట్‌మెంట్‌లలో సుమారు 1,000 అడుగుల విస్తీర్ణం ఉన్న ఫ్లాట్‌కు ఆరు నెలలకు ఆస్తి పన్ను రూ.900 ఉండేది. 2024-25 ఆర్థిక సంవత్సర ద్వితీయార్థంలో ఆస్తి పన్ను సవరణ జరిగినట్టుగా సమాచారం. అయితే అధికారులెవ్వరూ దీన్ని ధ్రువీకరించడం లేదు. అంతా ఆన్‌లైన్ అయిందని, భువన్ సాంకేతికత ద్వారా ఆటోమెటిక్‌గా ఆస్తి పన్ను సవరణ జరుగుతోందని అధికారులు మిగతా 4వ పేజీలో...

అందాల భామలకు ఉమ్మడి జిల్లా ఆతిథ్యం

- పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్న మిస్‌వరల్డ్ పోటీదారులు
- వచ్చే నెల 12న నాగార్జునసాగర్‌కు
- 15న పోచంపల్లి, యాదగిరిగుట్టకు ప్రపంచ సుందరీమణులు

'ప్రపంచ సుందరీమణులైన అందాల భామలకు ఆతిథ్యమిచ్చేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా వేదిక కానున్నది. ఇక్కడి ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలను మిస్‌వరల్డ్ పోటీదారులు సందర్శించేందుకు అవసరమైన ఏర్పాట్లను రాష్ట్ర పర్యాటకశాఖ డైరెక్టర్ స్మిత సబర్వాల్ నేతృత్వంలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ప్రభుత్వం హైదరాబాద్‌లో మే 7 నుంచి 31వ తేదీ వరకు 72వ ఎడిషన్ మిస్ వరల్డ్-2025 పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణ చేనేత కళను ప్రపంచానికి చాటేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ పోటీలకు 140 దేశాల నుంచి 3వేల మంది అందాల భామలు, విదేశీ ప్రతినిధులు హాజరుకానున్నారు. వీరి ద్వారా హైదరాబాద్‌తోపాటు పర్యాటక కేంద్రాలకు అంతర్జాతీయంగా గుర్తింపు తీసుకొచ్చేందుకు పర్యాటక, సాంస్కృతికశాఖ ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగా ఫ్యాషన్ ప్రపంచానికి ప్రతీకగా నిలిచే ఐరోపా దేశాల ప్రతినిధులతో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను ధరింపజేసి తద్వారా ఇక్కడి వస్త్రాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో అందాల భామలు భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట, నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించనున్నారు.

● ఆంధ్రజ్యోతి, భూదాన్‌పోచంపల్లి





హైదరాబాద్ వేదికగా జరగనున్న 72వ మిస్‌వరల్డ్ పోటీలను తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు వేదికగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. ముఖ్యంగా పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాలను ఫ్యాషన్ ప్రపంచానికి మరింత చేరువ చేసి, నేతన్నలకు అండగా నిలిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

మే 15న పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలతో ర్యాంప్ వాక్

చేనేత ఇక్కత్ వస్త్రాలకు అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన భూదాన్‌పోచంపల్లిని మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొనే అందాల భామలు మే 15న సందర్శించనున్నారు. ఇక్కడి చేనేత కార్మికులతో వారు ముఖాముఖీ మాట్లాడుతారు. అనంతరం చేనేత మగ్గాలపై చేనేత డబుల్ ఇక్కత్, సింగిల్ ఇక్కత్ వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలిస్తారు. తరువాత పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ చీరలు ధరించి ర్యాంప్ వాక్ చేసేలా కార్యక్రమాలను రూపొందించారు. మిస్‌వరల్డ్ ఈవెంట్లను నిర్వహించే సంస్థ పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల విశిష్టతను వీడియోగ్రఫీ చేస్తోంది. ఫలితంగా చేనేత ఉత్పత్తులను అంతర్జాతీయంగా మరింత పేరును తీసుకురావడమే ఈవెంట్‌ల ముఖ్య ఉద్దేశ్యమని తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ స్మిత సబర్వాల్ తెలిపారు. ఇప్పటికే అనేక ఫ్యాషన్ ఈవెంట్లకు వేదికగా నిలిచిన పోచంపల్లికి ఇప్పుడు మరోసారి ప్రపంచ సుందరీమణులు వస్తుండడంతో ఈ ప్రాంతం అంతర్జాతీయంగా మరింత ఖ్యాతి పొందనుంది.

పోచంపల్లి గ్రామీణ పర్యాటకంలో ప్రత్యేక ఏర్పాట్లు

మిస్‌వరల్డ్-2025 పోటీల్లో 'చేనేత థీమ్' ప్రత్యేక ఆకర్షణగా మిగతా 2వ పేజీలో...

ధాన్యం కొనుగోలులో రైతులకు

ఇబ్బందులు లేకుండా చూడాలి

పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి సన్నబియ్యం, తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలన్నారు. దేశంలో అత్యధికంగా వరి సాగుచేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందన్నారు. వానాకాలంలో 153లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, యాసంగిలో 125.5లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. వానాకాలం పంటను ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసినందుకు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులకు, సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు. వానాకాలం కంటే యాసంగి సీజన్‌లో అదనంగా 70లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, దీనిపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ చేయాలన్నారు. రైస్‌మిల్లర్లు తాలు, తరుగు పేరుతో ఎలాంటి కోతలు విధించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎఫ్‌సీఐ మార్గదర్శకాల ప్రకారం నూకల శాతం 25 దాటకుండా చూడాలని, ప్రభుత్వం అందించే ధరకంటే అధికంగా ఉన్నప్పుడు మాత్రమే రైతులు ప్రైవేట్‌గా ధాన్యం విక్రయించాలని, తక్కువ ధరకు ఎట్టి పరిస్థితుల్లో విక్రయించవద్దని అన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంలో పోలీసుల భాగస్వామ్యం

చందంపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణతోపాటు వారి ఆరోగ్య విషయంలో కూడా పోలీసులు భాగస్వాములవుతున్నారని ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. శనివారం మండలంలోని పోలేపల్లి యూపీఎస్ పాఠశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్‌శాఖ ప్రజా రక్షణతోపాటు సమాజ ఆరోగ్య రక్షణకు కూడా పాటుపడటం శుభపరిణామం అన్నారు. మండలం ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు రక్షణతోపాటు ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో దేవరకొండ ఏఎస్పీ మౌనిక, సీఐ సురేష్, ఎస్ఐ సతీష్, కాంగ్రెస్ నాయకులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

'భూభారతి'తో ఏటా రికార్డుల అప్‌డేట్

కలెక్టర్ ఇలా త్రిపాఠి

హాలియా, పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): భూభారతితో ఏటా రికార్డులను అప్‌డేట్ చేస్తామని, భూములకు హద్దులు నిర్ణయించేందుకు సర్వేయర్ల ద్వారా జియో కోఆర్డినేట్ ఏర్పాటు చేసే వెసులుబాటు ఈ చట్టంలో ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం తిరుమలగిరి(సాగర్), పెద్దవూర మండల కేంద్రాల్లో, అనుముల మండలం కొత్తపల్లి రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూములను సర్వే చేసేందుకు గతంలో రైతులు, అధికారులు, తహసీల్దార్లు ఇబ్బందులు పడేవారని, భూభారతి ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే లైసెన్స్ సర్వేయర్ పద్ధతిని తీసుకురానున్నామన్నారు. భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని, అందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టంపై రైతులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. ధరణిలో 4వేలకు పైగా క్వరీలు ఉండేవని, భూభారతిలో కేవలం ఆరు మాడ్యుల్స్ మాత్రమే ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 2020 అక్టోబరు వరకు ఉన్న సాదాబైనామాలపై అప్పీలు పద్ధతి ఉండేదని, ఇప్పుడు భూభారతిలో ఆర్డీవోకు అప్పీలు చేసుకోవచ్చన్నారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా ప్రజలకు మేలు చేసే అవకాశం అధికారులకు ఉందన్నారు.



అనుమల మండలం కొత్తపల్లిలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

'భూభారతి' రైతులకు చుట్టం : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం రైతులకు చుట్టమని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానం మేరకు ధరణి స్థానంలో భూభారతి తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రం ఏర్పాటయ్యాక తిరుమలగిరి(సాగర్) మండలంలోనే మొదటిసారి అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటై 4వేల ఎకరాలకు సంబంధించి సుమారు 4,500 మంది రైతులను అర్హులుగా గుర్తించి పట్టాలు జారీ చేయనుండడం గర్వకారణమన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన వాగ్ధానాలన్నింటినీ ఏడాది లోపే అమలు చేసిందన్నారు. అంతేగాక సన్నబియ్యం వంటి బృహత్తర కార్యక్రమాన్ని అమలు చేసిందన్నారు. 'ధరణి'ని బంగాళఖాతంలో కలిపేస్తామన్నట్లుగానే సీఎం రేవంత్‌రెడ్డి దాన్ని చేసి చూపించారని, అదేవిధంగా రైతుల భూసమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం అందించే దిశగా 'భూభారతిని' తీసుకురావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో డీఈవో బిక్షపతి, పీసీసీ సభ్యుడు కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, యడవల్లి నరేందర్‌రెడ్డి, కాంసాని చంద్రశేఖర్, వెంపటి శ్రీనివాస్, గౌని రాజారమేష్‌యాదవ్, అలుగుల బ్రహ్మారెడ్డి, నాగిరెడ్డి, కోటిరెడ్డి, పిల్లి ఆంజనేయులు, కలసాని చంద్రశేఖర్, చవ్వా బ్రహ్మానందరెడ్డి, గడ్డం సాగర్‌రెడ్డి, అబ్బిడి కృష్ణారెడ్డి, ఏవో సరిత, ఏపీఎం కళావతి, రైతులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ సిబ్బందితో డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

నిడమనూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రాల సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ల్యాబ్‌తో పాటు స్టోర్‌రూంను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది సమయ పాలన పాటించి విధులకు హాజరుకావాలన్నారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందుతోందని, ఆరోగ్య కేంద్రాల్లో కూడా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచామన్నారు. ఆర్‌ఎంపీలు రోగులకు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని, అర్హతకు మించి చికిత్స చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబుల్లో ధరల పట్టికలు కచ్చితంగా ప్రదర్శించాలని, వైద్యుల విద్యార్హతలు, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ నెంబర్ కూడా ప్రదర్శించాలన్నారు. ఆస్పత్రుల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపర చర్యలు తీకుంటామన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న పీహెచ్‌సీ భవనాన్ని, మండల పరిధిలోని తుమ్మడం గ్రామంలో నిర్మిస్తున్న సబ్ సెంటర్ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కేసా రవి, మండల వైద్యాధికారులు డాక్టర్ అరవింద్, రఫీ, సిబ్బంది గంటా సోమయ్య, జలీల్‌పాషా, తదితరులు ఉన్నారు.

సమాజాభివృద్ధికి సహకార వ్యవస్థ కృషి

డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి సహకార వ్యవస్థ కృషి అమోఘమని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సహకార కేంద్ర బ్యాంకులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించడం సంతోషకరమన్నారు. గడిచిన కొన్నేళ్లలో సహకార వ్యవస్థలో చాలా మార్పులు జరిగాయని, చట్టాలపరంగా, సాంకేతికపరంగా మార్పులు వచ్చాయన్నారు. ఈ సహకార సంస్థ మరింత పురోగతి సాధించడంలో భాగంగా సంఘాలు, డీసీవో వ్యవస్థ, బ్యాంకులు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. 2024-25లో సహకార కేంద్ర బ్యాంకు అన్ని లాభాలు గడించడంతో పాటు ఎన్‌పీఏలు తగ్గించడంలో పురోగతి సాధించిందన్నారు. సమావేశంలో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల డీసీవోలతో పాటు బ్యాంక్ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదయ్య, వంగూరి రంగాచారి, రామచంద్రయ్య, జూలూరి శ్రీనివాస్, వీరస్వామి, సీఈవో శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

డీఎస్‌వోగా వెంకటేశ్వర్లు

బాధ్యతల స్వీకరణ



డీఎస్‌వోగా బాధ్యతలు తీసుకున్న వెంకటేష్‌కు మొక్కను అందజేస్తున్న అధికారులు, సిబ్బంది

నల్లగొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా టి.వెంకటేష్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన హైదరాబాద్ నుంచి బదిలీపై రాగా, ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీఎస్‌వోగా విధులు నిర్వహించిన హరీష్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు ఏఎస్‌వో రాజశేఖర్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బీ.వెల్లెంల రిజర్వాయర్‌లోకి | ● 2లో..

నీటి విడుదల

విజయోత్సవ సభను

విజయవంతం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

చండూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మే నెలలో నిర్వహించే విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిరడమర్తి రవి అన్నారు. మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కురుపాటి సుదర్శన్‌తో కలిసి శనివారం చండూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మాదిగలకు 9శాతం రిజర్వేషన్ అమలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా మాదిగలు చేసిన నిర్వీరామ పోరాటానికి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో న్యాయం జరుగుతోందన్నారు. రోస్టర్ పాయింట్ 6శాతం కాకుండా 7శాతం కల్పించేందుకు మందకృష్ణ కృషి చేయాలన్నారు. ఏపీలో జిల్లాల వారీగా వర్గీకరణ తీసుకువచ్చిన మాదిరిగానే రాష్ట్రంలో కూడా జిల్లాల వారీగా వర్గీకరణ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. మే మొదటి వారంలో హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో 10లక్షల మందితో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో నక్క మహేష్, జోగు గణేష్ సంజీవ, విజయ్, జంగయ్య, జగన్, స్మామ్రాట్ కిరణ్, పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లోని డాక్టర్ అంజయ్య ప్రకృతి వైద్యశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాల దళిత మోర్చా జిల్లా కార్యదర్శి ఉబ్బపల్లి నాగ రాజు కోరారు. వేసవి కారణంగా బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు లేక గర్భిణులు, రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు : తహసీల్దార్

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ఎప్పటికప్పుడు ధాన్యం కాంటాలు వేయాలని తహసీల్దార్ హరిబాబు సూచించారు. మండలంలోని అన్నారం, అవంతీపురంలోని తడకమళ్ల, ఆలగడప, మిర్యాలగూడ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు.

మొక్కల సంరక్షణ బాధ్యతను తీసుకోవాలి



రావిచెట్టుకు రక్షాబంధన్ కట్టిన మోడల్‌స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

డిండి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మొక్కల సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి సూచించారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా యూత్ ఏకో క్లబ్ కార్యక్రమాన్ని శనివారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలను సంరక్షించడంతోపాటు పర్యావరణాన్ని అవగాహన చేసుకోవాలని కోరారు. మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఆవరణంలో ఉన్న రావిచెట్టుకు యూత్ ఏకో ప్రోగ్రాం ఇన్‌చార్జి డాక్టర్ శ్యాంసుందర్ పచ్చని రిబ్బన్‌కట్టి విద్యార్థులు, ఉపాధ్యాయులతో రక్షబంధాన్ (రాఖీ) కట్టించి చెట్లను సంరక్షించడం సమిష్టి బాధ్యత అని విద్యార్థులకు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, రమ, జగన్నాథ్, వెంకటేశ్వర్లు, విజయ్, చెన్నయ్య, రవి, బాలకృష్ణ, సోమయ్య, పీడీ రవి, సందీప్, రాజు, శ్రీను పాల్గొన్నారు.

వాహనదారులు ట్రిపుల్ ఆర్‌ను పాటించాలి



పీ.టీనగర్‌లో ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

చింతపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సాగర్-హైవేపై రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రిపుల్ ఆర్‌ను నిబంధనలు వాహనదారులు పాటించాలని ఎస్ఐ యాదయ్య సూచించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)లో శనివారం వాహనదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రిపుల్ ఆర్ కార్యక్రమంపై పోలీస్ కళా బృందం అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. రోడ్డుపై వెళ్లే వాహనదారులందరూ నియమ నిబంధనలు పాటిస్తే తమ గమ్యస్థానాలకు చేరుకోనే అవకాశం ఉంటుందన్నారు, మద్యం సేవించి హెల్మెట్ లేకుండా బైక్‌పై వెళ్లేనప్పుడు ప్రమాదవాశత్తు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆయన తెలిపారు. రోడ్డు సెఫ్టీ, బాధ్యత, నియమాలను పాటిస్తే కొంతమేరకు ప్రమాదాలను తగ్గించే వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మునుకుంట్ల శేఖర్‌గౌడ్, కొప్పుల జంగయ్య, వసంత్‌నాయక్, బీఆర్ఎస్ నాయకుడు ఉడుత అక్రం యాదవ్, పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు

● కొండమల్లేపల్లిలో కంపుకొడుతున్న కాలనీలు ● ఇబ్బందులు పడుతున్న స్థానికులు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి-కొండమల్లేపల్లి)

గ్రామ పంచాయతీ పాలక మండళ్ల పదవీ కాలం ముగియడంతో గతేడాది ఫిబ్రవరి నుంచి అంటే దాదాపు 14 నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. దీనితో మెజారిటీ పల్లెల్లో పాలన పడకేసింది. మేజర్ గ్రామపంచాయతీ అయిన కొండమల్లేపల్లికి కేవలం పశువుల సంత నుంచి దాదాపు రూ.1.30కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ మండల కేంద్రంలో పారిశుధ్యం విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైంది.



సాగర్ రోడ్డు నుంచి చింతచెట్టుతండాకు వెళ్లే దారిలో..

సర్పంచుల పదవీ కాలం ముగిసిన నాటి నుంచి గ్రామాల్లో నియమితులైన ప్రత్యే కాధికారులు తమకు ఏమీ తెలియదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. స్థానిక గ్రామపంచాయతీ పక్కనే రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తున్న గ్రామపంచాయతీ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

ఎక్కడెక్కడ అంటే..

స్థానిక జేబీ కాలనీలో పెద్ద అపార్టుమెంట్ల నుంచి వచ్చే మురుగు నీరు సరైన డ్రైనేజీ నీరు లేకపోవడంతో ఆ అపార్ట్‌మెంట్ మురుగు నీరు మొత్తం రోడ్లమీదనే ప్రవహిస్తుండడంతో గుంతలుగా ఏర్పడి మురికి నీళ్ల రోడ్లుగా మారాయి. గ్రామపంచాయతీ అధికారులు రోజు అక్కడి నుంచి వెళ్తున్న.. వస్తూ పోతున్న పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. సాగర్ రోడ్డు నుంచి చింతచెట్టుతండాకు వెళ్లే రోడ్డు, దేవరకొండ రోడ్డులోని ఇంద్రపురం కాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు మురుగు కుంటలుగా ఏర్పడి రోడ్లపైనే పారు తుండడంతో దుర్గంధం వస్తుందని పలువురు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు వల్ల దోమలు, పందులు సంచరించడంతో విష జ్వరాల బారిన పడుతున్నామని, అలాగే వేసవి కాలం కావడంతో ఆరు బయట నిద్రించలేకపోతున్నామని, ఈ సమస్యను గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఫలితం లేదని ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని వీధుల్లో మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



జేబీలోని గ్రామపంచాయతీ పక్కన రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

మురుగు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నాం



మా కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్లలో వాడిన వృథా నీరు కాలువలు లేకపోవడంతో ఇళ్ల మధ్యలో చేరి గుంతలుగా ఏర్పడి దోమలు పందులు సంచరించడంతో విషజ్వరాలు వచ్చే అవకాశం ఉంది.

-చంద్రమౌళి, దేవరకొండ రోడ్డు, ఇంద్రపురం కాలనీ

అధికారులు సమస్యను పరిష్కరించాలి

మురుగు నీరు రోడ్ల మీద ప్రవహిస్తున్న మాట వవాస్తవమే. కొత్తగా డ్రైనేజిలు నిర్మించాలంటే గ్రామపంచాయతీలో సరిపడ నిధులు లేవు. గ్రామపంచాయతీ కొత్త పాలకవర్గం కొలువుదీరాక డ్రైనేజి కాలువలు నిర్మిస్తాం.

-డాకునాయక్, పంచాయతీ కార్యదర్శి

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

దేవరకొండ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గుడ్‌ఫ్రైడే, ఈస్టర్‌ను పురస్కరించుకొని చర్చి కమాన్ వద్ద రన్‌ఫర్ జీసెస్‌ను దేవరకొండలో శనివారం ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచానికి ప్రేమతత్వం బోధించినది ఏసు అని, ఆయన త్యాగం మహోన్నతమైందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కాంగ్రెస్ నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎం.ఎ.సిరాజ్‌ఖాన్, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, మారుపాకల అరుణాసురేష్‌గౌడ్, ఎంపీడీవో డానియెల్, క్రైస్తవ పెద్దలు ఎస్‌బి.జాన్, పాస్టర్ వేణు, కోనేరు ప్రభుదాస్, హైజాగ్, పాల్గొన్నారు.



దేవరకొండలో రన్‌ఫర్ జీసెస్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

● చింతపల్లి :మండలంలోని నెల్వాలపల్లికి చెందిన గుర్రం వెంకటేష్ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలునాయక్ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఆయన తెలిపారు. ఆయన వెంట పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎండి.సిరాజ్‌ఖాన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, గుర్రం జగన్, బొంత పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో శనివారం రన్‌ఫర్ జీసస్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాజ్యోతి బాపూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సాగర్ బీసీ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీకి అనుబంధంగా ఉనన్న బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి ఇంటర్ సెకండ్ ఇయర్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు. సాగర్ బీసీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ(ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంపీజీ, బీజడ్సీ బీజడ్‌జీ)లో ప్రతి కోర్సులో 40 సీట్లు, బీకాంలో 80 సీట్లు, బీఏ (ఈహెచ్‌పీ)లో 40 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ కూడా ఉందన్నారు. డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఎలాంటి ప్రవేశ పరీక్ష లేదని అర్హత ఉన్న విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి నచ్చిన కోర్సులో దరఖాస్తు చేసుకోని సీటు పొందవచ్చు అన్నారు. దరఖాస్తు చివరి తేదీ మే 5న అని తెలిపారు. వివరాలకు 8179665589, 8801521626 నంబర్‌లను సంప్రించాలని కోరారు

ఆరో తరగతి బ్యాక్‌లాగ్ సీట్లకు నేడు పరీక్ష

మహాత్మా జ్యోతిబా రావు పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఆరో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాగర్ బీసీ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో మొత్తం 240 మంది విద్యార్థులు పరీక్ష హాజరవుతారని వివరించారు. ఉదయం 9 గంటల లోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయన కోరారు.

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌పై చర్యలు తీసుకోవాలి

● దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నేతల ఫిర్యాదు



ఎమ్మెల్సీ దయాకర్‌పై ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

దేవరకొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షాపై అసభ్యకర పదజాలంతో దొంగలు, కేడీలు అని అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌పై కేసు నమోదు చేయాలని బీజేపీ దేవరకొండ పట్టణశాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ అజ్మీర రమేష్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెజవాడ శేఖర్, పట్టణాధ్యక్షుడు వస్కుల సుధాకర్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ, అమిత్‌షాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అద్దంకి దయాకర్‌పై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రిని, కేంద్రమంత్రిని విమర్శించడం అద్దంకి దయాకర్‌కు తగదన్నారు. ఫిర్యాదు చేసినవారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, నాయకులు రవికుమార్, గుండాల అంజయ్య యాదవ్, జల్లా భాస్కర్, సహదేవ్, చండీశ్వర్, అజయ్, గంపా ఫణి, తదితరులు ఉన్నారు.

ఏఐటీయూసీ మహాసభలను జయప్రదం చేయాలి

వేములపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో శనివారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తీసుకు రావడంలో ఏఐటీయూసీ అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. కార్మికశాఖలో ఖాళీగా ఉన్న ఉద్యో గాలను భర్తీ చేసి కార్మికులకు మెరుగైన సేవలు అందిం చాలన్నారు. జిల్లా యాదయ్య, నాయకులు కత్తుల భిక్షం, శ్రీరాంరెడ్డి, రహీం, రామానుజన్‌రెడ్డి, శ్రీను, నాగరాజు, వెంకన్న పాల్గొన్నారు.

మల్లీశ్వరి మృతికి కారకులను శిక్షించాలి

హాలియా,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండలం బొక్కమంతలపాడు గ్రామానికి చెందిన మల్లీశ్వరీ ఆత్మహత్య కారుకులని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆ సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు ఆడెపు నాగార్జున మాట్లాడుతూ మల్లేశ్వరి ఆత్మహత్య కారణమైన వారందరిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు గార్లపాటి ప్రసాద్, మల్లేపల్లి నరేందర్, తరి పెద్ద నాగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నిడమనూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో లావూరి వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ముందస్తు బడిబాట ఉపాధ్యాయులతో కలిసి నిర్వహించారు. పాఠశాలల్లో ఉన్న వసతుల గురించి వివరిస్తూ పిల్లలను తమ పాఠశాలల్లో చేర్పించాలని తల్లి దండ్రులను కోరారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో 8 మంది, ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు విద్యార్థులను చేర్పించారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గౌతమ్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చంద్రకళ, కర్నాటి శ్రీనుకుమార్, రామ్మోహన్, లచ్చయ్య, వెంకన్న, జలందర్, విజయలక్ష్మి, జ్యోతి, మాధ వి, పద్మావతి, ఝాన్సీ, స్వాతి పాల్గొన్నారు.

● త్రిపురారం : పెద్దదేవులపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శనివారం బడిబాట నిర్వహించారు. అనంతరం మండల వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన వంట పాత్రలు మండలంలోని 25 పాఠశాలలకు ఎంఈవో రమావత్ రవి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, సైదిరెడ్డి, బాబు, గంగాధర్‌రావు, రవి ఉపాధ్యాయులు లక్ష్మమ్మ, గౌతమి, వెంకటయ్య, కొండలు, మల్సూర్, సతీష్ పాల్గొన్నారు.

● దామరచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఎంఈవో బలాజీనాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ధీరావత్ బుజ్జిలింగా నాయక్ అన్నారు. శనివారం మండలంలోని కల్లెపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గొబ్బూరి శ్రీనివాస్‌రావు, శ్రీదేవి, గురువారెడ్డి, పాషా, కవిత నారాయణ, పాల్గొన్నారు.

● మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ బడులకు పూర్వ వైభవం తేవాలని ఎంఈవో లావూరి బాలు ప్రధానోపాధ్యాయులను కోరారు. మధ్యా హ్న భోజన వంట సామగ్రిని తన పరిధిలోని 63 పాఠశాలలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మంగ్లి, అరుణ, ధర్మ నాయక్ పాల్గొన్నారు.

వేతన సవరణ ప్రక్రియ సకాలంలో చేపట్టాలి

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రైస్ మిల్ కార్మికుల వేతన సవరణ ప్రక్రియ సకాలంలో చేపట్టాలని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముక్కెర అంజిబాబు యాదవ్ కోరారు. ఈ సం ఘం భవనంలో శని వారం మాట్లాడుతూ రైస్‌మిల్ డ్రైవర్ల వేతన ఒప్పందం జనవరి 2025 నాటికే ముగిసిందని, వెంటనే మిల్లర్ల సంఘానికి విషయం తెలియజేశామన్నారు. అయితే ఇతర కార్మిక సంఘాల నుంచి స్పందన రానందున నూతన ఒప్పంద విషయం మే నెలకు వాయిదా వేసినట్లు మిల్లర్లు తెలిపారన్నారు. అయితే మే నెలలో ఇతర సంఘాల నుంచి వినతులు అందినా, అందక పోయినా.. దినసరి కార్మికులను ఇబ్బంది పెట్టరాదన్నారు. సమావేశంలో సంఘ పట్టణ అధ్యక్షుడు పానుగోటి వెంకటేశ్వరరావు, వెంకన్న, శంకర్, సైదులు, పిచ్చయ్య అంజయ్య, నాగేందర్, హుసేన్, పద్మ పాలొన్నారు.

ఆస్తిపన్ను అమాంతం పెరిగింది

(1వ పేజీ తరువాయి)

పేర్కొంటున్నారు.

హెచ్చుతగ్గులెందుకో?

పౌరసేవలు సులభతరం చేయడం, ప్రభుత్వ ఆదాయ మార్గాలు అన్వేషించడం కోసం రూపొందించిన సాంకేతికత ఆహ్వానించదగినదే. అయితే సదరు సాంకేతికతను వినియోగించడంలో నైపుణ్యం అవసరం. నిర్దేశించిన ప్రాంతాల్లో(పట్టణాల పరిధి) భవనాలు, ఖాళీ స్థలాల వివరాలను సేకరించే భువన్ సాఫ్ట్‌వేర్ మొత్తం ఆవాసాల కొలతలు ఎందుకు సేకరించడం లేదో తెలియని పరిస్థితి. ఒకే అపార్ట్‌మెంట్‌లోని ఒకే విస్తర్ణం ఉన్న ఫ్లాట్‌లకు ఆస్తి పన్నును వ్యత్యాసాలు ఉంటున్నాయి. తక్కువ విస్తీర్ణం ఉన్న ఫ్లాట్‌కు ఎక్కువ పన్ను, ఎక్కువ వైశాల్యంతో ఉన్న ఫ్లాట్‌కు తక్కువ పన్ను వస్తోంది. యంత్ర సేకరణలో లోపమా? సేకరించిన వివరాలను కంప్యూటర్లలో పొందుపరచడంలో తప్పిదమా? అనే అంశాలు బోధపడటం లేదు.

భువానాస్త్రం సంధిస్తున్నారా..?


పురపాలక ఆస్తుల రక్షణ, సొంత ఆదాయ వనరుల సమకూర్చేందుకు రూపొందించిన యాప్‌ను పట్టణాల్లో నివసించే ప్రజలపై భువానాస్త్రంగా సంధిస్తున్నారా? అని ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నారు. ఆస్తుల వివరాలను కచ్చితంగా నమోదు చేసేందుకు పారపాలకశాఖ కసరత్తు చేస్తోంది. అందులో భాగంగానే భువన్‌యాప్‌ను రూపొందించారు. అయితే సదరు యాప్ ప్రభుత్వానికి తీపిగా, ప్రజలకు చేదుగా మారొద్దనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆందోళన అవసరం లేదు



ఆస్తి పన్ను డిమాండ్ ఎక్కువ వచ్చిందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. భువన్ సర్వే ఇంకా పూర్తి కాలేదు. కొందరు యజమానులు వారి ఇళ్ల, భవనాలను ఇష్టానుసారంగా విస్తరించుకుంటున్నారు. మరికొందరు అదనపు కట్టడాలను పూర్తిచేశారు. భువన్ సర్వే వాటిని గుర్తించింది. శాటిలైట్ ఆధారిత మ్యాప్ ద్వారా కచ్చితమైన కొలతలు, అదనపు నిర్మాణాలు, అనుమతి లేని కట్టడాల వివరాలను సేకరించి అవసరమైన చర్యలు చేపడతాం.

రీ అసెస్‌మెంట్ చేయిస్తాం



ఆస్తి పన్ను అదనంగా వచ్చిందని భావించిన యజమానులు కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి. కార్యాలయంలో సంప్రదిస్తే పరిశీలించి తిరిగి ఆస్తిపన్ను ముదింపు చేస్తాం. అదనంగా ఉంటే నిబంధనల మేరకు రెట్టింపు పన్ను విధిస్తాం.

జ్ఞానేశ్వరి, మునిసిపల్ రెవెన్యూ ఆఫీసర్, మిర్యాలగూడ